

RNI NO:TELTEL/ 2023/89546

సూర్య రేఖ
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 429 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 14 ఏప్రిల్ 2026 | వెల : 4/-

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క
# లీగల్ నోటీసులు



- 48 గంటల్లోకి ఆ పోస్టులు తొలగించాలని డిమాండ్
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు
- అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు
- 48 గంటల్లో పోస్టులు తొలగించి క్షమాపణలు చెప్పాలని నోటీసులు

హైదరాబాద్

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలుపై ఆరోపణలు విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపారు. నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని సీతక్క తెలిపారు. టెండర్ వాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇచ్చినట్లు - మిగతా3లో



## పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

- నారీ శక్తి వందన్ సమ్మేళన్‌లో ప్రధాని కీలక వ్యాఖ్యలు
- మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దపు పెద్ద నిర్ణయం
- 2029లోగా అమలు చేయాలని లక్ష్యం
- అన్ని పార్టీల సహకారం అవసరమని మోదీ పిలుపు

## మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

- రాజకీయ లబ్ధి కోసమే మోదీ సర్కార్ అలా చేస్తోంది
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్న కేంద్రం
- మహిళా రిజర్వేషన్ చట్టానికి తాము వ్యతిరేకం కాదన్న ఖర్గే
- నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించిన సోనియా గాంధీ



## దక్షిణాది రాష్ట్రాలపై
# కేంద్రం వివక్ష

### డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను

- మహిళా రిజర్వేషన్ల పేరుతో లోక్‌సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందన్న రేవంత్ రెడ్డి
- మహిళాబిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతిస్తారని స్పష్టం
- జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల పెంచేలా బీజేపీ యత్నిస్తోందని ట్వీట్
- ఎన్డీఏ ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కటం లేదు
- డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం
- డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను
- మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు
- సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి



హైదరాబాద్

పురుషులతో పాటు మహిళలకు సమాన ఓటు హక్కు కల్పించిందే కాంగ్రెస్ పార్టీ అని.. అలాంటి పార్టీ మహిళా రిజర్వేషన్ల బిల్లును ఎందుకు వ్యతిరేకిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇంతకాలం అడ్డుకుంది ఎన్డీయేనే నని ఆరోపించారాయన. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ చేస్తున్న ప్రచారంపై సోమవారం సెక్రటేరియట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి దేశ ప్రజలందరికీ సంబంధించిన అంశాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ, బీజేపీ మాత్రం తమ సొంత వ్యవహారం అన్నట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను కలిపి తీసుకురావడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏ మాత్రం ప్రాధాన్యం దక్కడం - మిగతా3లో

## కాళేశ్వరం బ్యారేజీల
# పునరుద్ధరణ

- పరీక్షల వేగం కోసం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
- అధికారులు, ఇంజినీర్లు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి సమీక్ష
- పునరావాస డిజైన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు



హైదరాబాద్

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల పునరుద్ధరణ పనుల వేగవంతంపై సర్కార్ దృష్టి సారించింది. వేల కోట్ల విలువైన సాగునీటి పథకాన్ని సాధ్యమైనంత త్వరగా వినియోగం లోకి తెచ్చేలా కసరత్తు చేస్తోంది. అందుకు అనుగుణంగా బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత్ మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. మేడిగడ్డను కనీసం పాక్షికంగానైనా వినియోగంలోకి తేవాలని మంత్రి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు నీటిపారుదల రంగ నిపుణుడు కర్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా అత్యున్నత స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ కమిటీ వారానికి రెండు సార్లు సమావేశాలు నిర్వహిస్తుందని వెల్లడించారు. - మిగతా3లో



## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన
# సమ్మె సైరన్

- ఏప్రిల్ 22 నుంచి ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె
- ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటన
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్



## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

- రేపటికల్లా ఎల్‌పీజీతో భారత్‌కు 'జగ్ విక్రమ్'
- 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని వెల్లడి
- ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు
- వాటిని వీలైనంత త్వరగా హర్మూజ్ దాటిస్తాం: కేంద్రం

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

- కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- దొంగఓట్లు అరికట్టేందుకు బయోమెట్రిక్స్ నమోదు చేయాలని సుప్రీంకోర్టులో పిల్
- ఎన్నికల నిర్వహణపై కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు





## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

- జనసేనాని విత్ జెన్‌జీ కార్యక్రమంలో విజయ్‌పై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు
- రాజకీయాల్లో రాణించడానికి విజయ్‌కు సలహా ఇస్తారా అని ప్రశ్న



## మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

- మమతపై అమిత్ షా ఫైర్
- రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దన్నారు
- మహిళా సీఎంగా మహిళలకు ఇచ్చిన సలహాకు మమత సిగ్గుపడాలి
- బీజేపీ వస్తే, యువతులు అర్ధరాత్రీ స్కూటర్‌పై తిరగొచ్చు
- బంగాల్ ఎన్నికల ర్యాలీల్లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# పార్లమెంటు కొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉంది

దేశం కొత్త చరిత్రను లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 21వ శతాబ్దంలో అతి కీలకమైన నిర్ణయాల్లో ఒకటిగా నిలిచే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు భారత్ సిద్ధమవుతోందని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన నారీ శక్తి వందన్ సమ్మేళన్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఈ నిర్ణయం పూర్తిగా మహిళల సాధికారతకు అంకితమైందని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో కీలక దశలో ఉన్న ఈ సమయంలో మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని మోదీ అన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న మహిళా రిజర్వేషన్ అంశంపై ఇప్పుడు స్పష్టమైన ముందడుగు పడబోతోందని పేర్కొన్నారు. "ఇది కేవలం ఒక బిల్లు కాదు. మహిళల శక్తికి అంకితమైన నిర్ణయం. దేశ భవిష్యత్తు సంకల్పాలను నెరవేర్చే దిశగా ఇది కీలకమైన అడుగు" అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ అవసరం దాదాపు నాలుగు దశాబ్దాలుగా చర్చలో ఉందని, అన్ని రాజకీయ పార్టీలూ తమ తమ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చాయని మోదీ గుర్తు చేశారు. 2023లో పార్లమెంట్‌లో నారీ శక్తి వందన్ అధినియమాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ సమయంలోనే 2029లోగా అమలు చేయాలని అన్ని పార్టీలు కోరిన విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు.

**రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని మోదీ పిలుపు**

ఈ నేపథ్యంలో 2029ను లక్ష్యంగా పెట్టుకుని మహిళా రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని



తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటులో ఈ అంశంపై సమగ్ర చర్చలు జరగనున్నాయని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలను పక్కనపెట్టి సహకరించాలని పిలుపునిచ్చారు. "సమష్టి కృషితో పార్లమెంట్ గౌరవం మరింత పెరుగుతుంది. దేశంలోని ప్రతి మహిళ గర్వపడేలా ఈ నిర్ణయం ఉండాలి" అని అన్నారు. మహిళల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని మోదీ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం కేవలం నినాదంగా కాకుండా, పాలనలో సహజ భాగంగా మారాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఈ బిల్లు ఆ దిశగా ఒక పెద్ద అడుగు అవుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళల పాత్రను ఉదాహరణగా చూపిస్తూ, ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్షలాది మహిళలు స్థానిక సంస్థల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారని చెప్పారు. సుమారు 14 లక్షలకుపైగా మహిళలు స్థానిక సంస్థల్లో సేవలందిస్తున్నారని, కొన్ని రాష్ట్రాల్లో వారి ప్రాతినిధ్యం 50 శాతానికి చేరుకుందని వివరించారు. ఇది మహిళల నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

**మహిళలకు తోడుగా ఉండే విధంగా!**

దేశంలో రాష్ట్రపతి నుంచి ఆర్థిక మంత్రివరకు కీలక పదవుల్లో మహిళలు సేవలందించడం గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. మహిళలు తమ ప్రత్యేకమైన రాజకీయ వారసత్వాన్ని నిర్మించుకుంటున్నారని, ఇది దేశ అభివృద్ధికి కీలకమని చెప్పారు. మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అనేక పథకాలు అమలు చేస్తోందని ప్రధాని వివరించారు. పుట్టినప్పటి నుంచి జీవితాంతం వరకు మహిళలకు తోడుగా ఉండే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందించామని చెప్పారు. ఇక మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన కీలక అంశాల్లో జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) కూడా భాగమని సమాచారం. ప్రస్తుతం జనగణన ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2011 జనగణన ఆధారంగా ఈ ప్రక్రియను కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. డెలిమిటేషన్ అనంతరం లోక్‌సభ స్థానాలు పెరగవచ్చని అంచనా. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన సవరణ బిల్లు, అలాగే డెలిమిటేషన్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ రెండు బిల్లులు రాజ్యాంగ సవరణలుగా ఆమోదం పొందాల్సి ఉంటుంది. మొత్తానికి, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే ఈ నిర్ణయం దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశముంది.

# మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు

మహిళా రిజర్వేషన్ల చట్టం గురించి చర్చించేందుకు ఏప్రిల్ 15న తమ పార్టీ ఒక అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఈ బిల్లుపై సంబంధిత వర్గాలన్నింటితోనూ సమగ్ర సంప్రదింపులు జరపడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అయితే జాతీయ స్థాయిలో దీని ప్రభావం విస్తృతంగా ఉన్నందున, మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టానికి తమ పార్టీ వ్యతిరేకం కాదని వెల్లడించారు. కర్ణాటకలోని బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. "మహిళా రిజర్వేషన్ల చట్టంపై చర్చించేందుకు కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ పార్టీ పాల్గొంటుంది. తగు సూచనలను అందిస్తుంది. కానీ కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి సిద్ధంగా లేదు. అందుకే మేము ఏప్రిల్ 15న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూనే ఉంది. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. అంతేకాకుండా నారీ శక్తి వందన్ అధినియంకు మేం వ్యతిరేకం కాదు. పార్లమెంట్‌లో ఇది ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టం. మోదీ సర్కార్ కేవలం ఈ చట్టం ద్వారా రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోంది. మేము ఇప్పటికే పంచాయతీలు, జిల్లా పరిషత్తులు, కార్పొరేషన్లలో ఈ చట్టాన్ని దీనిని అమలు చేశాము. కాబట్టి మాకు ఎవరూ నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. దేశానికి సంబంధించిన ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, దానికి విస్తృతమైన పర్యవసానాలు ఉంటాయి."

**మోదీ సర్కార్‌పై సోనియా ఫైర్**

అలాగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు, మహిళా రిజర్వేషన్ల చట్టం తదితర అంశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ సైతం మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టం కంటే నియోజకవర్గాల పునర్విభజనే అత్యంత ముఖ్యమైన అంశమన్నారు. నియోజకవర్గాల



పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. అలాగే ఈ ప్రక్రియను రాజ్యాంగంపైన చేస్తున్న దాడిగా పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. కులగణనను మరింత ఆలస్యం చేసి, దాన్ని పట్టాలు తప్పించడమే ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ అసలు ఉద్దేశమని ఆరోపించారు.

"తమిళనాడు, బంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని చూస్తోంది. బలవంతంగా ఆమోదింపజేయాలనుకుంటున్న బిల్లులకు మద్దతు ఇవ్వాలని ప్రధాని మోదీ ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ తొందరపాటుకు ఒక కారణం ఉంది. రాజకీయ లబ్ధి పొందడం కోసం, ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేయడం కోసమే మోదీ ఇలా చేస్తున్నారు. ప్రధాని మోదీ ఎప్పటిలాగే నిజాన్ని దాచిపెడుతున్నారు. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణలపై చర్చించడానికి బంగాల్ చివరి దశ ఎన్నికలు (ఏప్రిల్ 29) ముగిసిన తర్వాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు ప్రభుత్వానికి ఏకంగా మూడుసార్లు లేఖలు రాశారు. కానీ మోదీ సర్కార్ విపక్షాల అభ్యర్థనను తిరస్కరించింది. అందుకు బదులుగా ప్రధానమంత్రి సంపాదకీయాలు రాయడం, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తులు చేయడం, ఇతర సమావేశాలు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. నిర్ణయాలు తీసుకునే విషయంలో తన మాటే నెగ్గాలి అన్నట్లు మోదీ వ్యహరిస్తున్నారు. నారీ శక్తి వందన అధినియం సవరణ బిల్లును పార్లమెంట్ స్పెషల్ సెషన్‌లో కాకుండా పార్లమెంట్ వర్షాకాల సమావేశంలోనే తీసుకురావాలని కోరుతున్నాను." అని సోనియా గాంధీ పేర్కొన్నారు.

**ఆ హక్కులను పది కోట్ల మంది కోల్పోయారు : సోనియా గాంధీ**

నారీ శక్తి వందన్ అధినియం- 2023 చట్టం 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లుల విజయాల పునాదిపైనే రూపుదిద్దుకుందని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఆ సవరణ బిల్లులు ఆమోదం పొందిన తర్వాతే పంచాయతీలు, నగరపాలక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కల ప్రక్రియ వాస్తవానికి 2021లోనే జరగాల్సి ఉందని, కానీ మోదీ ప్రభుత్వం దానిని వాయిదా వేస్తూ వచ్చిందని మండిపడ్డారు. దీని పర్యవసానంగా ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనకు ప్రాతిపదికగా నిలిచే జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 కింద లభించే చట్టపరమైన హక్కులను 10 కోట్లకు పైగా ప్రజలు కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు.

**కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ**

మరోవైపు, నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి తమ పార్టీ లోక్‌సభ ఎంపీలందరూ తప్పక హాజరుకావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. ఏప్రిల్ 16-18 వరకు సభలో అత్యంత కీలకమైన కొన్ని అంశాలపై చర్చ, ఓటింగ్ జరగనున్నాయని తమ పార్టీ ఎంపీలకు సూచించింది. ఆ మూడు రోజులు ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడేంత వరకు తప్పనిసరిగా సభలో ఉండాలని కోరింది. పార్టీ వైఖరికి మద్దతు తెలపాలని కోరుతూ విప్‌ను జారీ చేసింది.

# మహిళా సీఎంగా అలాంటి సలహా ఇచ్చినందుకు సిగ్గుపడాలి

మహిళా ముఖ్యమంత్రి అయినప్పటికీ మమతా బెనర్జీ బంగాల్ సోదరీమణులకు భద్రతను కల్పించలేక పోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్‌జీ కర్ రేప్ కేసుపై మమత స్పందిస్తూ, రాత్రి 7 తర్వాత ఇళ్ల బయటకు రావద్దని మహిళలకు సలహా ఇచ్చారని ఆయన విమర్శించారు. ఒక మహిళా సీఎంగా మహిళామణులకు ఆ విధమైన సలహా ఇచ్చినందుకు మమత సిగ్గుపడాలని షా ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో మహిళలకు భద్రతను కల్పించడంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం విఫలమైందన్నారు. సోమవారం బీర్భూమ్ జిల్లా మయూరేశ్వర్, ఖేరాసోల్, పశ్చిమ్ బర్ధమాన్ జిల్లా రాణీ గంజ్‌లలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే, యువతులు అర్ధరాత్రి 1 గంటలకూ స్కూటర్‌పై ప్రయాణించే సురక్షిత పరిస్థితి బంగాల్‌లో వస్తుందన్నారు. సందేశ్ ఖాలి, ఆర్‌జీ కర్, దుర్గాపూర్ లా కాలేజ్ (దక్షిణ కోల్‌కతా లా కాలేజ్) తరహా పైశాచిక ఘటనలు ఇక జరగవని కేంద్ర హోంమంత్రి చెప్పారు.

**అల్లర్లు జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు?**

"ఇప్పుడే నేను మమతా బెనర్జీ ప్రసంగం ఒకటి విన్నాను. అందులో ఆమె మెజారిటీ సామాజిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికల్లో టీఎంసీ గెలవకుంటే, మెజారిటీ సామాజిక వర్గం మనుగడ సాధ్యం కాదని మమత అంటున్నారు. టీఎంసీ పాలనలోనే ముర్షిదాబాద్ అల్లర్లు జరిగాయన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. రామ నవమి వేడుకలపైనా దాడులు జరిగాయి. సరస్వతీ పూజపై నిషేధం విధించారు. అవన్నీ జరిగినప్పుడు మమత ఎక్కడికి పోయారు? రాష్ట్రంలోని మెజారిటీ సామాజిక వర్గాన్ని సీఎం మమత భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీదీ మేం ఎన్నో శతాబ్దాలుగా ఇదే దేశంలో నివసిస్తున్నాం. మమ్మల్ని బెదిరించడానికి మీరెవ్వరు? అయోధ్యలో రామ్ లల్లాను 550 ఏళ్ల పాటు టెంటు కింద ఉంచడానికి మమతా



బెనర్జీ లాంటి నేతలే కారకులు. చివరకు ప్రధాని మోదీ సారథ్యంలోనే అయోధ్య రామమందిరం నిర్మాణం జరిగింది. మమతా బెనర్జీ తొత్తు హుమయూన్ కబీర్ బంగాల్‌లో బాబ్రీ మసీదును నిర్మించాలని కోరుతున్నారు. కానీ అందుకు బీజేపీ అస్సలు అనుమతించదు" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. "ఈ ఎన్నికలు బంగాల్‌కు టర్నింగ్ పాయింట్‌గా మారుతాయి. టీఎంసీ గూండాలు ఇకపై బాంబు పేలుళ్లతో బంగాల్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేరు. బంగాల్ ప్రజలు ఆ బాంబులకు బ్యాలట్లతో, భయానికి విశ్వాసంతో సమాధానం ఇస్తారు. బంగాల్ ప్రజలంతా కమలం (తామర పువ్వు) గుర్తుకే ఓటేయాలి. బంగాల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు అనేది గోడపై రాత లాంటిది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి టాటా బైబై చెప్పాలని బంగాల్ ప్రజలు డిసైడయ్యారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే అందరు టీఎంసీ గూండాల భరతం పడుతుంది. నేను ఇవాళ టీఎంసీ గూండాలకు ఒకే విషయం చెబుతున్నాను. మొదటిదశ పోలింగ్ జరగనున్న ఏప్రిల్ 23న మీరంతా ఇళ్లలోనే ఉండండి. లేదంటే మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చాక మిమ్మల్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టిస్తాం. బీజేపీ గెలవగానే టీఎంసీ ప్రభుత్వంలోని సిండికేట్లు, అవినీతిపరులను తలకిందులుగా వేలాడదీసి సరి చేసే బాధ్యతను తీసుకుంటుంది. నేరచరితులకు నెలవుగా టీఎంసీ మారింది. ఆ నేరచరితులే చాలా ఏళ్లుగా బంగాల్‌లోని బీజేపీ క్యాడర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు జరిగిన మరుసటి రోజు (మే 5న) బీజేపీ కార్యకర్తలు తమను హింసించిన టీఎంసీ గూండాలను బయటకు లాగి న్యాయస్థానాల ఎదుట నిలబెడతారు" అని అమిత్ షా హెచ్చరించారు. "టీఎంసీ ప్రభుత్వం చాలా స్కాంలు చేసింది. దాదాపు రూ.5వేల కోట్ల మేర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసింది. భారత పార్లమెంటులో జరిగిన ప్రశ్నకు డబ్బులు స్కాంకూ టీఎంసీయే కారణం. 26వేల స్కూల్ టీచర్ల ఉద్యోగాల తొలగింపు యత్నం, రేషన్ పంపిణీ స్కాం, పశువుల స్మగ్లింగ్, స్థానిక సంస్థల్లో ఉద్యోగాల భర్తీ, ఉపాధి హామీ పథకం, పీఎం ఆవాస్ వంటి వాటిలోనూ టీఎంసీ ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. మేం అధికారంలోకి వచ్చాక అవినీతిపరుల నుంచి ప్రతీ రూపాయిని కక్కిస్తాం. 7వ వేతన సంఘం సిఫారసులను రాష్ట్రంలో 45 రోజుల్లోగా అమల్లోకి తెస్తాం. మహిళలు, నిరుద్యోగ యువతకు ప్రతినెలా రూ.3వేలు, గర్భిణులకు రూ.21వేలు, దివ్యాంగులకు ప్రతినెలా రూ.2వేలు ఇస్తాం. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తాం. రాష్ట్ర బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతిని కల్పిస్తాం. ఆయుష్మాన్ భారత్ స్కీం ద్వారా రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా అందరికీ అందుబాటులోకి వస్తుంది. రైతులకు ఏటా ఇచ్చే ఆర్థికసాయాన్ని రూ.9వేలకు పెంచుతాం. మేం అధికారంలోకి వచ్చాక బంగాల్‌లో 5 పారిశ్రామిక ఎస్టేట్‌లను నిర్మిస్తాం. తద్వారా రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహానికి మార్గాన్ని సుగమం చేస్తాం" అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. "బంగాల్ సహా దేశం నుంచి చొరబాటుదారులను తరిమేయడానికే ఈ అసెంబ్లీ ఎన్నికలు. బంగాల్ నుంచి చొరబాటుదారులను తరిమేసే సత్తా మమతకు లేదా ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి ఉందా? టీఎంసీ ప్రభుత్వం కనీసం దేశ సరిహద్దు కంచెకు కూడా భూమిని కేటాయించడం లేదు. కానీ బంగాల్‌లో చొరబాట్లకు బీఎస్‌ఎఫ్ కారణమని మమత ఆరోపిస్తున్నారు.

## కాల్పుల విరమణ వేళ హర్మూజ్ దాటిన తొలి భారతీయ నౌక

జగ్ విక్రమ్ అనే భారత నౌక 20,400 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 14కల్లా గుజరాత్‌లోని కాండ్లాకు చేరుకుంటుందని పోర్టులు, నౌకాయానం, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ వెల్లడించారు. 24 మంది సిబ్బందితో కూడిన జగ్ విక్రమ్ నౌక ఏప్రిల్ 11నే హర్మూజ్ జలసంధిని దాటిందని ఆయన తెలిపారు. అమెరికా – ఇరాన్ మధ్య 14 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హర్మూజ్ మీదుగా వస్తున్న తొలి భారత నౌక ఇదేనన్నారు. గత 24 గంటల వ్యవధిలో గల్ఫ్ సముద్ర జలాల్లో భారత జెండా కలిగిన నౌకలు, భారతీయ నావికులపై ఒక్క దాడి కూడా జరగలేదని ముకేశ్ మంగళ్ చెప్పారు. సోమవారం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్, అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 2,177 మంది భారతీయ నావికుల సురక్షిత ప్రయాణానికి తమ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. గల్ఫ్‌లో గత 24 గంటల్లోనే 93 మంది భారతీయ నావికుల కోసం సురక్షిత ప్రయాణ ఏర్పాట్లు చేశామని ముకేశ్ పేర్కొన్నారు.

**ప్రస్తుతానికి గల్ఫ్‌లో 15 భారత నౌకలు**

"నావికుల సంక్షేమానికి మేం కట్టుబడి ఉన్నాం. ఇందుకోసం నిరంతరాయంగా సముద్రజలాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. భారత విదేశాంగ శాఖ, గల్ఫ్ పరిధిలోని భారతీయ మిషన్లు, సముద్ర జల రవాణాతో ముడిపడిన విభాగాలు, సంస్థలతో సమన్వయం చేసుకుంటున్నాం. గల్ఫ్‌లో చిక్కుకున్న అన్ని భారతీయ నౌకలను తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని హర్మూజ్ దాటించి భారత్‌కు తీసుకొస్తాం. ప్రస్తుతానికి భారత్‌కు చెందిన 15 నౌకలు గల్ఫ్ సముద్ర జలాల్లో ఉన్నాయి" అని కేంద్ర నౌకాయాన శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు.

**నిరంతరాయంగా ఎల్‌పీజీ సప్లై**

**బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపు**

భారత్‌లో తగినంత ఎల్‌పీజీ స్టాక్ ఉందని, సిలిండర్ల పంపిణీ నిలకడగా జరుగుతోందని కేంద్ర పెట్రోలియం – సహజ వాయువు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. దేశ ప్రజలంతా బాధ్యతాయుతంగా ఎల్‌పీజీని వినియోగించాలని, భయాందోళనతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దని సూచించారు. ఇకపైనా ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ నిరాటంకంగా జరుగుతుందని ఆమె భరోసా ఇచ్చారు. ఎల్‌పీజీ నిల్వలపై భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తోందని, దేశవ్యాప్తంగా ప్రజలకు సిలిండర్ల సప్లైలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేస్తోందని సుజాత శర్మ చెప్పారు. దేశంలోని ఎల్‌పీజీ కస్టమర్లలో దాదాపు 99 శాతం మంది ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్, వాట్సాప్, మొబైల్ అప్లికేషన్ల వంటి డిజిటల్ వేదికల ద్వారా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని తెలిపారు. దీనివల్ల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల కేంద్రాలకు జనం రద్దీ తగ్గుతుందని, వేగవంతంగా సిలిండర్ల డెలివరీకి అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

**ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీల పొడిగింపు**

ఎలక్ట్రిక్ వాహనాలపై అందిస్తున్న రాయితీలను కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఎలక్ట్రిక్ త్రీ వీలర్లపై అందించే సబ్సిడీకి సంబంధించిన టర్మినల్ తేదీని 2028 మార్చి వరకు పొడిగించామని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి హనీఫ్ ఖురేషి తెలిపారు. ఇక టూవీలర్లపై రాయితీ పొడిగింపు 2026 జులై వరకు అమల్లో ఉంటుందన్నారు.

**ప్రధాని ఆదేశాల మేరకు గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్ బలోపేతం**

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు తాము గల్ఫ్ దేశాలతో కమ్యూనికేషన్‌ను బలోపేతం చేస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఇందులో భాగంగానే భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఏప్రిల్ 11, 12 తేదీల్లో యూఏఈలో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పెద్దలను కలిశారని ఆయన తెలిపారు. పశ్చిమాసియా సైనిక ఘర్షణ వేళ భారతీయులకు భద్రత కల్పించినందుకు యూఏఈ పాలకులకు భారత విదేశాంగ మంత్రి ధన్యవాదాలు చెప్పారన్నారు.

## విజయ్ చాలా పెద్ద స్టార్ ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం

లతమిళనాడు ఎన్నికల్లో బరిలోకి దిగిన నటుడు విజయ్?కు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మద్దతు తెలిపారు. విజయ్ సమర్థుడని, చాలా పెద్ద స్టార్? అని కొనియాడారు. అలాంటి వ్యక్తి ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని అన్నారు. ఇటీవల 'జనసేనాని విత్ జెన్‌జీ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విజయ్‌కు సలహా ఇస్తారా అని అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానిమిచ్చారు. 'నేను ఎవరికీ సలహా ఇవ్వను. నా పిల్లలకు విషయంలో కూడా అంతే. ప్రతి ఒక్కరూ తమదైన మార్గంలో ముందుకు వెళ్లగలరు. ఇక విజయ్? విషయానికొస్తే ఆయన చాలా పెద్ద స్టార్. ప్రతి పౌరుడికి రాజకీయాల్లోకి రావడానికి, పార్టీ స్థాపించడానికి హక్కు ఉంది. ఆయన ఏ పాత్రలో ఉన్నా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని నేను భావిస్తున్నా' అని పవన్ కల్యాణ్ తెలిపారు. పాలిటిక్స్‌లోకి రావాలంటే ఎలాంటి త్యాగాలు చేయాల్సి వస్తుంది? అని ఓ యువకుడు అడిగిన ప్రశ్నించాడు. అందుకు త్యాగాలు చేయకూడదు అని పవన్ కల్యాణ్ బదులిచ్చారు. రాజకీయాన్ని ఎప్పుడూ వ్యాపారం కోణంలో చూడకూడదని చెప్పారు. ప్రజలకు సేవ చేసే ఆలోచన ఉంటే ఎవరైనా రాజకీయాల్లోకి రావొచ్చని సలహా ఇచ్చారు. సరైన విధంగా వినియోగించుకుంటే సోషల్ మీడియా ఎంతో పవర్‌ఫుల్ అని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఒకవేళ మీరు కంటెంట్ క్రియేటర్ అయి ఉంటే ఎలాంటి వీడియోలు చేస్తారు అని అడగ్గా, దేశభక్తి, ప్రకృతి పరిరక్షణపై చేస్తానని చెప్పారు. జనసేన పార్టీను 2014లో స్థాపించిన పవన్ కల్యాణ్, తొలినాళ్లలో అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. 2019 ఎన్నికల్లో పరాజయాలు చవిచూసినా, 2024లో తెలుగుదేశం పార్టీ, బీజేపీతో కలిసి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రాజకీయంగా కీలక మైలురాయి సాధించారు.

**హోలోగ్రామ్ టెక్నాలజీతో విజయ్ పార్టీ ప్రచారం**

ఇదిలా ఉండగా, తమిళనాడులో రాజకీయ ప్రచార పద్ధతుల్లో కొత్త మార్పుకు టీవీకే శ్రీకారం చుట్టింది. విజయ్ హోలోగ్రామ్‌ను ఉపయోగించి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 12న కుంభకోణం నియోజకవర్గంలో ఈ సాంకేతికతను తొలిసారిగా వినియోగించారు. హైడెఫినిషన్ 3డీ హోలోగ్రామ్ ద్వారా విజయ్ ప్రసంగం ప్రజలకు చూపించారు. ప్రచార వాహనంపై ఈ డిజిటల్ ప్రతిరూపం ప్రత్యక్షంగా మాట్లాడుతున్నట్లుగా కనిపించడంతో ప్రజల్లో ఆసక్తి పెరిగింది. టీవీకే నాయకత్వం తెలిపిన వివరాల ప్రకారం, పార్టీ 200కు పైగా నియోజకవర్గాల్లో పోటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతానికి విజయ్ స్వయంగా వెళ్లడం సాధ్యం కాదని భావించి, హోలోగ్రామ్ టెక్నాలజీని వినియోగించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ హోలోగ్రామ్ ప్రాజెక్ట్‌ను రూపొందించిన ప్రవీణ్ అనే 20 ఏళ్ల యువకుడు, ఏఐ, డేటా సైన్స్ చదువుతున్న విద్యార్థి. అతను 50 సెకన్ల విజయ్ ప్రసంగాన్ని ఏఐ ఆధారంగా రూపొందించి, మూడు రోజుల్లో హోలోగ్రామ్‌గా మార్చినట్లు తెలిపాడు.

## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్స్ అమలుపై పిల్

ఎన్నికల నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. దొంగ ఓట్లను అరికట్టేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, ఐరిస్ బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థను అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణను చేపట్టేందుకు సోమవారం సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేంద్రం, ఎన్నిక సంఘానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ అంశంపై విచారణ చేపట్టింది. అయితే ప్రస్తుత జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ విధానం అమలు చేయలేమని స్పష్టం చేసింది. తదుపరి పార్లమెంట్ లేదా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ విధానాన్ని అమలు చేయాలా అనే అంశాన్ని పరిశీలించాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ విధానం అమలు చేయాలంటే నిబంధనల్లో మార్పులు అవసరమవుతాయని, అలాగే ప్రభుత్వ ఖజానాపై భారీ ఆర్థిక భారం పడుతుందని తెలిపింది. ఈ అంశంపై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, ఈసీతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేశారు. ఓటింగ్ ప్రక్రియలో అవినీతి, అనుచిత ప్రభావం, నకిలీ, డూప్లికేటు ఓట్లు వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

-మొదటిపేజీ తరువాయి

లేదని తెలిపారు. 33 % మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండింటిని కలిపి ఇప్పుడు తీసుకువస్తున్నారన్న సీఎం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన అమలు చేయాలని ఎన్డీఏ చూస్తోందని అన్నారు. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లను చేయాలనేది తమ డిమాండ్ అని వెల్లడించారు. ఈ రెండింటిని కలపటం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని విమర్శించారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, మహిళా రిజర్వేషన్లను ఆర్నెళ్లలోనే అమలు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

**చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని**

డీలిమిటేషన్ అనేది చాలా ప్రమాదకర దిశలో వెళ్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం చేసే కుట్రను మోదీ చేస్తున్నారని, కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్థంగా అమలు చేశాయని, ఉత్తరాదిలో కుటుంబ నియంత్రణ సరిగా జరగకపోవటంతో జనాభా విపరీతంగా పెరిగిందని ఆరోపించారు. జనాభా అంతరం వల్లనే నియోజకవర్గాల పెంపును కేంద్రం గతంలో వాయిదా వేసిందని, జనాభా ప్రాతిపదికన చేస్తే చిన్న రాష్ట్రాలు నష్టపోతాయని భావించారని పేర్కొన్నారు 2026 వరకు సీట్ల పెంపు వద్దని 2001లో వాజ్‌పేయి సర్కార్ చట్ట సవరణ చేసిందని గుర్తు చేశారు.

**ఆ రాష్ట్రాల్లో సీట్లు భారీగా పెరుగుతాయి**

జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయని, దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారని, ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్లు పెంచుతామని మోదీ చెప్తున్నారని తెలిపారు. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో సీట్లు భారీగా పెరగనున్నాయని, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందని అంచనా వేశారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో లోక్‌సభ సీట్లు 195 అవుతాయని, సీట్ల పెంపు తర్వాత ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయని, ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కు పెరుగుతుందని వివరించారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని కీలకశాఖల్లో ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వటం లేదని, దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా బీజేపీ వెళ్తోందని విమర్శించారు. మహిళా బిల్లును అడ్డుపెట్టుకుని డీలిమిటేషన్ చేయొద్దని కోరారు. ప్రస్తుత సీట్ల ప్రకారమే చట్టప్రకారమే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టాలి అన్నట్లుగా ఉందని, పన్నులు కట్టాలి, సలాం కొట్టాలి అనే విధానానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. "డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం, డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు?. సీట్లు 50 శాతం పెంచాలని మోదికి ఏ దేవుడు చెప్పాడు?. 50 శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం పెంచుతుంది" రేవంత్ రెడ్డి, సీఎం

**2028 వరకు గడువు ఉంది**

హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది తమ డిమాండ్ సీఎం తెలిపారు. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలని కోరారు. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీ ప్రాతిపదికగా తీసుకోవాలని, కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలని, కొత్తగా పెంచే సీట్లలో మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలని డిమాడ్ చేశారు. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని, మొదట మహిళా బిల్లు ఆమోదించి తర్వాత డీలిమిటేషన్‌పై చర్చ చేయాలని అన్నారు. డీలిమిటేషన్‌పై శాసనసభల్లోనూ చర్చ జరగాలని, డీలిమిటేషన్‌పై ఒక కమిటీ వేసి ప్రజాసంఘాల అభిప్రాయాలు కూడా సేకరించాలని తెలిపారు. 2026లో జనగణన పూర్తి చేసి సమగ్ర చర్చ తర్వాత సీట్ల పెంపు చేయాలని, నియోజకవర్గాల పెంపునకు 2028 వరకు గడువు ఉందని వివరించారు.

లోక్ సభ సీట్ల పెంపులో దక్షిణాధి రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, జనాభా ప్రాతిపదికన కాకుండా దేశ వృద్ధిలో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న అంశాల ఆధారంగా సీట్ల పెంపు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. ప్రస్తుతం కేంద్రం, మహిళా రిజర్వేషన్లతో పాటు సీట్ల పెంపు చేపడుతోందని, ఈ రెండు వేర్వేరు అంశాలని రేవంత్ రెడ్డి అన్నారు.

**భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుంది**

మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతిస్తారని కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయని రేవంత్ అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలుపరిస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లను అడ్డుపెట్టుకొని లోక్ సభ సీట్లను పెంపును జనాభా ప్రాతిపదికన చేపట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ విధానం భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తుందని అన్నారు. జాతీయ ప్రయోజనాలే ఏ పార్టీకైనా ముఖ్యంగా ఉండాలని తెలిపారు.

**సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది**

దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు ఎంతో తోడ్పాటునందిస్తున్నాయని, దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక వృద్ధి ఆధారంగా సీట్ల పెంపు ప్రక్రియ చేపట్టాలని ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని, దీన్ని బలవంతంగా అందరిపై రుద్దకుండా ఆర్థిక వృద్ధి ఆధారంగా అనే అంశాన్ని అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిశీలించాలని కోరారు.

**డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డికి అవగాహన లేదు**

డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డికి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని, తాము దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియకు రెండు సంవత్సరాల సమయం పడుతుందని అన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నానని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్ రెడ్డికే వదిలేస్తున్నానని వెల్లడించారు.

# రేవంత్ జీడీపీ ఫార్ములా వర్కౌటవుతుందా

**హైదరాబాద్ :** నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు భారత రాజకీయాల్లో ఒక సెన్సిటివ్ వార్ జోన్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం జనగణన తర్వాత 50 శాతం సీట్ల పెంపు ఫార్ములాతో వడివడిగా అడుగులు వేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై ధ్వజమెత్తుతున్నారు. కేవలం సీట్ల పెంపు అనేది అంకెల గారడీ మాత్రమేనని, ఇది దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఆయన ప్రతిపాదిస్తున్న జీడీపీ ఫార్ములా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.కేంద్రం ఆలోచిస్తున్న 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనను రేవంత్ రెడ్డి పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. అందరికీ సమానంగా సీట్లు పెంచినప్పటికీ, అంతిమంగా ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యమే కొనసాగుతుందని ఆయన విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాదిలోని కేవలం నాలుగు రాష్ట్రాల ఎంపీ సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తే, అది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనాభా నియంత్రణ పాటించాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అద్భుత ప్రగతి సాధించాయి. ఇప్పుడు కేవలం జనాభా తక్కువగా ఉన్నారనే కారణంతో పార్లమెంట్‌లో మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే.. క్రమశిక్షణతో ఉన్నందుకు మాకు ఇస్తున్న శిక్షా? అని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు.ఈ సంక్లిష్ట సమస్యకు రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన, హేతుబద్ధమైన పరిష్కారాన్ని ప్రతిపాదించారు. నియోజకవర్గాల కేటాయింపు కేవలం జనాభా మీద, లేదా నిర్దిష్టంగా 50శాతం అని కాకుండా, ఆయా రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారం ఆధారంగా ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దేశానికి అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నిర్ణయాధికారంలోనూ అంతే ప్రాధాన్యత ఉండాలని కోరుతున్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల రాజకీయ బలాన్ని తగ్గించడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. జనాభాను నియంత్రించి, ఆర్థికంగా ఎదిగిన రాష్ట్రాలను గౌరవించాలంటే జీడీపీని ఒక ప్రామాణికంగా తీసుకోవడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, మొండిగా ముందుకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, కోట్ల మంది దక్షిణాది ప్రజల ఆత్మగౌరవ సమస్య అని ఆయన పేర్కొన్నారు. కేంద్రం గనుక దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ఏకపక్షంగా పునర్విభజన చేపడితే భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ లోపల, బయట మా నిరసన గళం వినిపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన రాబోయే కాలంలో దేశ సమగ్రతను ప్రభావితం చేసే అంశంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రశ్నలు కేవలం తెలంగాణ కోణంలోనే కాకుండా, మొత్తం దక్షిణాది ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైనవి. 50శాతం ప్రాతిపదికన జరిగే విభజన ఉత్తరాది–దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉంది. మరి కేంద్రం రేవంత్ రెడ్డి సూచిస్తున్న జీడీపీ ఫార్ములాను పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

# మళ్లీ టీఆర్ఎస్సే

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు.బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్ గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి 'టీఆర్ఎస్'గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు.పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రం లోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..గత ప్రభుత్వ హయాంలో కొన్ని చిన్నపాటి లోపాలు జరిగాయని కేటీఆర్ ఈ సందర్భంగా అంగీకరించారు. ప్రజలకు, నాయకులకు మధ్య దూరం పెరగడం వల్లనే ఆశించిన ఫలితాలు రాలేదని, ఆ పొరపాట్లపై ఇప్పటికే లోతైన అధ్యయనం చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఈ లోపాలను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తామని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఇక డీలిమిటేషన్ ప్రక్రియ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 179కి, పార్లమెంట్ స్థానాలు 28కి పెరుగుతాయని ఆయన తెలిపారు. రాజకీయాల్లో డబ్బు ప్రభావం పెరగడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తెలుగు రాష్ట్రాల చరిత్రలో నలుగురు ముఖ్యమంత్రులు మాత్రమే తమ పాలనతో చెరగని ముద్ర వేశారని కేటీఆర్ అభివర్ణించారు. ఎన్టీఆర్, వైఎస్సార్, చంద్రబాబు నాయుడుతో పాటు కేసీఆర్ పేరు కూడా చరిత్రలో నిలిచిపోతుందని ఆయన ప్రశంసించారు. చంద్రుడిపై మబ్బులు కమ్మినంత మాత్రాన వెలుగు తగ్గదని, కేసీఆర్ మళ్లీ ఉజ్వలంగా ప్రకాశిస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## టీజీఎస్ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్




తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత నల 13న సమ్మె నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ తెలిపింది.

**ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి**

సమ్మె నివారణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్‌ఛైర్మన్ థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని అన్నారు.

## కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ

-మొదటిపేజీ తరువాయి

అవసరమైతే తాను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటానని రోజూ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకాధికారిని నియమించాలని యంత్రాంగానికి మంత్రి నిర్దేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ తదితర చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల ఫౌండేషన్, డిజైన్, ప్రణాళిక, అమలు అంశాల్లో తీవ్రమైన లోపాలను గుర్తించాయని మంత్రి పేర్కొన్నారు. మూడు బ్యారేజీల మరమ్మతుల ప్రక్రియలో 2027, 2028 సంవత్సరాలను అధికారులు కీలకంగా పరిగణించాలని దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోనే అన్నారం, సుందిళ్ల పనులు పూర్తవుతాయని సూచనప్రాయంగా వెల్లడించారు. అదే సమయంలో మేడిగడ్డ కొంత భాగాన్నీ పూర్తి చేస్తామన్న నమ్మకం ఉందన్నారు. బ్యారేజీల పునరావాస డిజైన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆఫ్రి ఇండియాకు బాధ్యతలు అప్పగించిందన్న ఉత్తమ్ వారంలో డిజైన్ల ప్రక్రియను పూర్తి చేయాలని అధికార్లను ఆదేశించారు.

**45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహణ**

నిర్మాణ సంస్థలు ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాతో నిరంతరం సంప్రదింపుల్లో ఉండాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. డిజైన్ల ప్రక్రియకు సంబంధించి భూభౌతిక, భూసాంకేతిక, మట్టి, హైడ్రాలిక్ మోడలింగ్ వంటి అన్ని అధ్యయనాలు సమగ్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహించేలా బ్యారేజీల ప్రాంతాల్లోనే ఉండాలన్న మంత్రి ఉత్తమ్ వారికి నిర్మాణ సంస్థలు పూర్తి సహకారం అందించాలని నిర్దేశించారు.

**సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో పనులు**

ఇటీవల కాళేశ్వరం మరమ్మతుల కోసం ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి, పనుల్లో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ సీడబ్ల్యూపీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ, సీబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కి.మీ బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మూడు బ్యారేజీలకు మరమ్మతులు చేసి త్వరలో వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం బ్యారేజ్ పనులను పూర్తి చేయాలనన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారు. అలాగే మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

ఆమె నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44 కోట్లు ఉంటే అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని.. తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియాలో దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందేనని ఆమె పేర్కొన్నారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో సీతక్క వెల్లడించారు.

**అసలేంటీ వివాదం**

చిన్నారులకు విద్యతో పాటు, పౌష్టికాహారాన్ని అందించే అంగన్?వాడీ టీచర్లకు ప్రభుత్వం రూ.44 కోట్లు వెచ్చించి సెల్‌ఫోన్లను అందించింది. గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముఖ్యపాత్ర పాత్ర పోషిస్తున్నాయి. పిల్లల హాజరు, పౌష్టికాహారం అందించే వివరాలను సెల్‌ఫోన్లలో టీచర్లు ఎంటర్ చేస్తున్నారు. పోషణ్, ఎన్ఎస్‌టీఎస్ అనే యాప్‌ల ద్వారా గర్భిణుల, బాలింతల ఫేస్ రికగ్నిషన్ కోసం ఫొటో తీయాల్సి ఉంటుంది. అదేవిధంగా యుక్త వయసు పిల్లలకు పోషకాలను అందించాలనే ఉద్దేశంతో పల్లీ పట్టి అందిస్తున్నారు. ఈ వివరాలను కూడా అంగన్?వాడీ టీచర్లు యాప్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అంగన్‌వాడీ టీచర్లకు గతంలో సెల్‌ఫోన్లు అందించగా వాటికి 5జీ స్థాయి నెట్‌వర్క్ సామర్థ్యం లేదు. దీంతో సిగ్నల్ సరిగా ఉండని ప్రాంతాల్లో టీచర్లు వాటిని ఉపయోగించటంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. పోషణ్ యాప్?ను వినియోగించటం సెల్‌ఫోన్లతో సాధ్యపడేది కాదు. భద్రాద్రి కొత్తగూడెం లాంటి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్ సరిగా ఉండదు. ఆ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పనిచేయక పోవటంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో అందించిన స్మార్ట్?ఫోన్లకు అనేక సమస్యలు ఉత్పన్నం అవటంతో వినియోగించలేదు. ఈ సమస్య కారణంగా ప్రభుత్వం అధునాతన ఫీచర్లు ఉన్న నూతన సెల్‌ఫోన్లను అందించింది. అంగన్‌వాడీ టీచర్లకు నూతన సెల్‌ఫోన్లు అందించే ప్రక్రియ మొదలైంది. సెల్‌ఫోన్ల ద్వారానే అంగన్?వాడీ టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉండటంతో వాటి అవసరం ఎంతో ఉంది. అయితే సెల్?ఫోన్ల కొనుగోలు విషయంలో 30 కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్? పార్టీ ఆరోపిస్తూ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా తనపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారని వాటిని తొలగింటి, క్షమాపణలు చెప్పాల్సిందేనని బీఆర్ఎస్ అధినేతకు సీతక్క నోటీసులు పంపించారు.

**ఎందుకు లీగల్ నోటీసులు పంపించారు**

కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు పంపడంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ స్పందించారు. అంగన్వాడీ టీచర్ల స్మార్ట్‌ఫోన్లలో అవినీతి జరిగిందని ఆరోపించారు. 35,310 స్మార్ట్‌ఫోన్ల కోసం రూ.54 కోట్లకు టెండర్ ఇచ్చారని, స్మార్ట్‌ఫోన్లపై రూ.24 కోట్లే ఖర్చు చేశారని, మిగిలిన రూ.30 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. 4జీ ఫోన్లు ఇస్తూ 5జీ ఫోన్లు ఇస్తున్నామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. సమాధానం చెప్పమంటే సీతక్క చెప్పుతో కొడతామంటున్నారని, తాము అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని సీతక్క అంటున్నారని పేర్కొన్నారు. సీతక్క కేసీఆర్‌కు ఎందుకు లీగల్ నోటీసులు పంపించారని ప్రశ్నించారు.

# సంపాదకీయం

## అగ్నిప్రమాదాలు- అప్రమత్తత అత్యవసరం

అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియచేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండ ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం , వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి.అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి.దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి.

# అసమాన ప్రతిభాశాలి రాహుల్ సాంకృత్యాయన్

రాహుల్ సాంకృత్యాయన్ (1893 ఏప్రిల్ 9 – 1963 ఏప్రిల్ 14) అసమాన ప్రతిభాశాలి, ఆయన మేధస్సును కొలవడా నికి ఏ కొలబద్ద సరి పోదంటే అతిశయోక్తి కాదేమో. కాలాలకు అతీతంగా యావత్ ప్రపంచ చరిత్రలోనే స్వయం కృషితో మహా పండితుడైన వ్యక్తి మరొకరు లేరని మేధావులు భావించడాన్ని బట్టి ఆయన ప్రతిభ తేట తెల్లం అవుతున్నది. ముప్పైకి పైగా భాషలు, వాటి యాసలు నేర్చుకుని అధికారికంగా చదువుకోక పోయినా విశ్వ విద్యాలయాల్లో బోధించే స్థాయికి ఎదగడాన్ని బట్టి ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది.రాహుల్ సాంకృత్యాయన్ నిరంతర లోక సంచారిగా పేరొంది, 45 సంవత్సరాల పాటు యాత్రలలోనే గడిపారు. లోతైన తాత్త్విక చింతన కలిగిన సాంకృత్యాయన్ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి బౌద్ధ భిక్షువుగా మారి అనంతరం మార్క్సిస్ట్ సోషలిస్టుగా పరివర్తన చెందారు. సాంకృత్యాయన్ భారత జాతీయోద్యమంలో కూడా కృషి చేశారు. జాతీయోద్యమానికి అనుకూలంగా, బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు, ప్రసంగాలు చేసినందుకు 3సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించారు. 1940వ దశకం ప్రారంభంలో ఆయన పూర్తిగా భౌతికవాద భావాలను స్వీకరించి, కమ్యూనిస్ట్ పార్టీలో సభ్యునిగా చేరి, జీవితాంతం కమ్యూనిస్ట్‌గా ఉన్నారు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షునిగా ఆయన అనేక రైతు పోరాటాలకు నాయకత్వం వహించారు. పురాతన బౌద్ధ గ్రంథాలను వెలికితీసి, వాటిని అనువాదం చేసి, ప్రపంచానికి తెలియపరచటంలో రాహుల్ అపారమైన కృషిని బౌద్ధులు ఎంతో విలువైనదిగా గుర్తించారు. యునైటెడ్ ప్రావిన్సెస్ (యూపీ) రాష్ట్రంలోని అజామ్‌గఢ్ జిల్లాలో 1893 ఏప్రిల్ 9లో సనాతన ధర్మాన్ని పాటించే బ్రాహ్మణ కుటుంబంలో కేదార్‌నాథ్ పాండే జన్మించారు. బౌద్ధాన్ని స్వీకరించాక, తన పేరును రాహుల్ సాంకృత్యాయన్‌గా మార్చు కున్నారు. ప్రాథమిక విద్య ఉర్దూ మాధ్యమంలో చదివారు. తొమ్మిదేళ్లప్పుడే ప్రపంచం ఏమిటో చూడాలని ఇంట్లోంచి పారిపోయాడు సాంకృత్యాయన్. 8వ తరగతి తోనే



అతని చదువు ఆగిపోయింది. కాశీ విద్యాపీఠ్‌లో సంస్కృతం నేర్చుకున్నాడు. ఆర్యసమాజంలో చేరి హిందూమత వ్యాప్తికి కొన్నాళ్లు కృషి చేశాడు. ఆయన నిత్యసంచారిగా వేలాది కిలోమీటర్లు కాలినడకన చుట్టివచ్చారు. మూడు బౌద్ధ వేదాలనూ జీర్ణించుకుని త్రిపిటకాచార్య అయ్యారు. టిబెట్, శ్రీలంక, ఇరాన్, చైనా, అప్పటి సోవియట్ రష్యా... ఎక్కడ తిరిగితే అక్కడి భాష నేర్చుకున్నారు. అరబిక్, భోజ్‌పురి, ఫ్రెంచ్, హిందీ, కన్నడం, మైథిలి, నేపాలీ, పాళీ, పర్షియన్, రష్యన్, రాజస్థానీ, సింహళీస్, తమిళం, ఉర్దూ లాంటి భాషలు అవలీలగా ఆయన నేర్చుకుని పట్టు సాధించారు. పదమూడో శతాబ్దంలో నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేసినప్పుడు బౌద్ధ భిక్షువులు పవిత్రమైన గ్రంథాలతో పారి పోయారనీ, ఆ విలువైన సంస్కృత పుస్తకాల్ని టిబెట్‌లోని ఆరామాల్లో భద్రపరిచి వుంచారనీ ప్రచారంలో ఉంది. అయితే, ఆరు వందల ఏళ్లుగా వాటిల్లో ఏముందో చూసినవారు లేరు. సాంకృత్యాయన్ వాటికోసం అన్వేషిస్తూ, దారి కూడా సరిగాలేని కొండల్లో నడుస్తూ, కాశ్మీర్, లడఖ్, కార్గిల్ మీదుగా టిబెట్ వెళ్లారు. అక్కడ పుస్తకాలైతే లభించాయిగానీ అవి సంస్కృతంలో లేవు. అన్నీ భోటి భాషలో ఉన్నాయి. రాహుల్ కంచర గాడిదల మీద వాటిని తరలించు కొచ్చారు. ఆ గ్రంథాలన్నీ పాట్నా మ్యూజియంలో ఉన్నాయిప్పుడు. మరో మూడుసార్లు టిబెట్ వెళ్లి, టిబెటన్ నేర్చుకుని, దాని వ్యాకరణ పుస్తకాలు రాశారు. టిబెటన్–హిందీ నిఘంటువు కూర్చారు. నాటి సోవియట్ యూనియన్‌లోని అనేక రిపబ్లిక్కులలో ఆయన విస్తృతంగా పర్యటించి, సంస్కృతం, పాళీ భాషలో లిఖించబడిన అనేక శాసనాలను, రాతి ఫలకాలనూ కనుగొన్నారు. భారతదేశం లోనూ, నేపాల్, హిమాలయ సానువులలోనూ, టిబెట్ లోనే కాకుండా ఆయన మంగోలియా, ఆఫ్ఘనిస్తాన్ ఆదిగా అనేక దేశాలలో విస్తృతంగా పర్యటించాడు. తన యాత్రలో భాగంగా అరుదైన "కాన్జూర్, టాన్జూర్, గ్రంథాలను కొన్నాడు 130 వర్ణ చిత్రాలు 1600 కు పైగా వ్రాత ప్రతులు సేకరించారు. యాత్రికుడు యుఁవాన్ త్స్యాంగ్ తర్వాత ఇంత భారీగా సేకరించిన వారెవరు లేరని చరిత్ర కారుల అంచనా. 70 సంవత్సరాల వయస్సులో మరణించే సమయానికి, ఆయన దాదాపు 140 పుస్తకాలు రాశారు. జీవితంలో మొత్తం జ్ఞాపకశక్తిని కోల్పోయారు. వందలాది పుస్తకాలు కూడా కంఠోపాఠంగా కలిగిన మహా జ్ఞాని, విజ్ఞాన ఖని చివరి రోజుల్లో తన పేరేమిటో తనే చెప్పుకోలేని మతిమరుపు లోకి జారి పోయారు.1963 ఏప్రిల్ 14లో శ్రీలంకలో ఆచార్యుడుగా పనిచేస్తూ, ఆయన అంతిమ శ్వాస విడిచారు. ఆయన స్మృతి చిహ్నం డార్జిలింగ్ నగరంలో బౌద్ధమత పద్ధతిలో నిర్మించబడింది. 1958లో సాహిత్య అకాడమీ పురస్కారం, 1963లో పద్మభూషణ్ బిరుదులు ఆయనకు లభించాయి.

# వీడుతున్న ఆక్రమణల చెర

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల ఫుట్‌పాత్ ఆక్రమణలపై ప్రభుత్వం కొరడా ఝుళిపించడంతో నగరవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విస్తరిస్తున్న నగరానికి తగ్గట్టుగా రహదా రులు లేకపోవడంతోపాటు భారీగా వాహనాల పెరుగుదలతో హైదరాబాద్ ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రజలు నిత్యం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగర ప్రజలు రద్దీ సమయాల్లో రోడ్లపై నడవాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్న కొన్ని ఫుట్‌పాత్‌లను కూడా చిరు, బడా వ్యాపారస్థులు కబ్జాలు చేయడంతో ఏమీ చేయలేక రోడ్డుపైనే నడుస్తూ ప్రయాణి కులు ప్రమాదాలకు గురైన ఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం నగరం నలువైపులా ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపుకు నడుం కట్టడంతో ప్రజలకు భారీ ఉపశమనం లభించనుంది. రాజకీయంగా, అధికారికంగా ఏ రూపంలోనైనా ఒత్తిడిలు వచ్చినా కబ్జాదారుల కబంధహస్తాల నుండి ఫుట్‌పాత్‌లను విముక్తి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రో నగరంగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ ఐటి, మౌలిక వసతులు, రహదారుల విస్తరణలో ముందంజలో ఉన్నా ఫుట్‌పాత్‌ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నాయి. దీంతో వేగంగా వెళ్లే వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా వృ ద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో నడక ప్రమాదకరంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం గ్రేటర్ హైదరాబాద్‌లో వెయ్యికిపైగా పాదచారుల ప్రమాదాలు నమోదవుతున్నాయి. ఉదాహరణకు 2024 గణాంకాలు పరిశీలిస్తే 400 మంది పాదచారులు ప్రమాదంలో మృతి చెందారు. 775 మంది గాయపడ్డారు. అంటే నగరంలో రోజుకు సుమారు 30 మందికిపైగా పాదచారులు రోడ్డు ప్రమాదాల బారీనపడుతున్నారు. ఈ ప్రమాదాలు అత్యధికంగా ఫుట్‌పాత్ సమస్యలతో ముడిపడి ఉండడం గమనార్హం. నగరంలో రహదారుల, ఫుట్‌పాత్ సమస్యలు పరిష్కరించడంలో భాగంగా వాటిని అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు మూడు వేల కోట్లకుపైగా రూపాయలు వెచ్చించి వెయ్యి కిలోమీటర్లకు పైగా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా బిటి, సిసి రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, సెంట్ల్ మీడియన్లు, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 700 కిలోమీట ర్లకుపైగా రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు, అదనంగా 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను ఎఫ్‌డిఆర్ సాంకేతికతతో పునర్నిర్మాణం చేయనున్నారు. వీటితోపాటు నగరం మొత్తం ఫుట్‌పాత్‌లను కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిహెచ్‌ఎంసి 2025 –26లో గుంతలు పూడ్చడంతోపాటు ట్రాఫిక్ భద్రతా చర్యలను చేపట్టింది. నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేం దుకు 24 లింక్ రోడ్ల నిర్మాణానికి సుమారు రూ. 487 కోట్ల ప్రణాళికను అమలు చేస్తున్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ను ఆక్రమిం చి ట్రాఫిక్ సమస్యలకు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న కట్టడాలపై కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమైన జిహెచ్‌ఎంసి ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణం గా నగరం నలువైపులా అక్రమ కట్టడాలను తొలగించేందుకు



ముందుకొచ్చిన జిహెచ్‌ఎంసి ఏప్రిల్ 4వ తేదీన హైడ్రా, పోలీసు శాఖలతో సమన్వయం చేసుకొని ఆరు జోన్ల్ పరిధిలో ని 798 నిర్మాణాలను నేలమట్టం చేసింది. తొలగించిన వాటిలో 340 పూర్తిస్థాయి, 458 తాత్కాలిక నిర్మాణాలు న్నా యి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సున్నితమైన పాతబ స్తీతోపాటు కొన్ని చోట్ల ఉద్రిక్తతలు నెలకొన్నా అధికారులు సమన్వయంతో విజయవంతంగా అక్రమాలను తొలగించారు. ఇదే తరహాలో ఇకపై నగరవ్యాప్తంగా ప్రతివారం ఏదో ఒక ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని జిహెచ్‌ఎంసి అధికారులు ప్రకటించడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నా యి. నగర ప్రజలు ఇదే కోరుకుంటున్నారు. చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరం లోని ప్రధాన మార్గాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలు పలు సమస్యల కు కారణాలవుతున్నా యి. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకట్టుకునే చార్మినార్ పరిసరాల్లో వ్యాపారస్థులు పూర్తిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పర్యాటకులు నడవలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ హైదరాబాద్‌కు ముఖద్వారమయిన మూసీనదిపై నాటి నిజాం కాలంలో నిర్మించిన వంతెన ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ప్రస్తుతం పాతబస్తీలో మూసీ నదిపై ఉన్న వంతెనలన్నింటిలో 'నయాపూల్'గా పిలువబడే వంతెన ఎత్తైనది. భారీ వాహనాల ప్రయాణానికి అనువుగా నిర్మించిన ఈ వంతెనపై రిక్షాలు, సైకిళ్ల కోసం, పాదచారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. 2000 సంవత్సరం వరకు ఇదే తరహాలో ఉండేది. అయితే దురదృష్టవశాత్తు ఇప్పుడు భారీ వాహనాల మార్గం మినహాయించి రిక్షాలు, సైకిళ్లు, పాదచా రులకోసం ఏర్పాటు చేసిన మార్గాలు పూర్తిగా తోపుడు బం డ్లతో నిండిపోతున్నాయి. అక్కడ పాదచారులు భారీ వాహ నాలు నడిచే మార్గంలోనే నడవాల్సి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇదే మార్గంలో ముందుకెళ్తే చారిత్రాత్మక కట్టడాలున్న మదీనా, గుల్జర్‌హౌజ్, చార్మినార్ మరింత క్లిష్ట పరిస్థితులున్నాయి. పాతబస్తీలోనే కాదు నగరం నడిబొడ్డున ఉన్న సికింద్రాబాద్, కోఠి, నాంపల్లి, చిక్కడిపల్లి, మెహిదీపట్నం, ఆరాంఘర్, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్ పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ వంటి పలు ప్రధాన మార్గాల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నా స్పందించకుండా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిలో తప్పు చేస్తున్నామనే స్పందనలేకపోవడం, రాజకీయ ప్రయోజ నాలతో వారికి మద్దతుగా నేతలు బలప్రదర్శన చేస్తూ అధికా రులను అడ్డుకోవడం దురదృ ష్టకరం. ఇటీవల నగరంలోని ఆరు జోన్లలో అక్రమాలను తొల గిస్తుంటే పాతబస్తీతోపాటు కొన్ని చోట్ల నాయకులు అడ్డుకోవ డానికి ప్రయత్నించినా అధి కారులు వెనక్కి తగ్గకుండా పని పూర్తిచేయడం అభినంద నీయం. ఎంతోకాలం గా అక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, వారందరూ చిరు వ్యాపారులు అంటూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారికి మద్దతుగా నిలిచే వారు వాదిస్తున్నారు. దీర్ఘకాలికంగా వారక్కడ ఆక్రమించి ప్రజ లను ఇబ్బందుల పాలుచేస్తున్నారనే ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటుందనే వాస్తవాన్ని వారు గ్రహించాలి. చిరువ్యాపా రుల జీనవోపాధి దెబ్బతినడం బాధా కరమే. ఇలాంటి వారి కోసం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా ప్రత్యామ్నాయం ఆలోచించి చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రధాన కూడళ్లలో బడా వ్యా పారస్థులు కూడా తమ దుకాణాలకు ముందున్న ఫుట్‌పాత్‌ల ను ఆక్రమించి లావాదేవీ లు నిర్వహిస్తున్న ప్రదేశాలు నగరంలో కోకొల్లలు. మరికొన్ని చోట్ల పెద్ద వ్యాపారస్థులే వారి మనుషులతో ఫుట్‌పాత్‌లను ఆక్రమింపజేసి వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. వాస్తవాలు ఇలా ఉంటే చిరువ్యాపారులకు అన్యాయం జరుగుతుందంటూ రాజకీయ నేతలు అధికారు లపై ఒత్తిడి తేవడం ప్రజలను ఇబ్బందుల పాలుజేయడమే. విస్తరిస్తున్న హైదరాబాద్ మహాన గరానికి అనుగుణంగా రహదారులు, ఫుట్‌పాత్ అభివృద్ధి కోసం ఆలస్యంగానైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై కబ్జాల తొలగింపు కార్యక్రమాన్ని ఒక్క రోజుకే పరిమితం చేసి చేతులు దులుపుకోకుండా ఆ అక్రమ కట్టడాలపై పర్యవేక్షణ నిత్యం కొనసాగాలి. తొలగించిన కట్టడాలను పాతబస్తీ వంటి కొన్ని ప్రాంతాల్లో తిరిగి నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని అరికడితేనే ప్రభుత్వ లక్ష్యం సఫలమవు తుంది. ఎలాం టి ఒత్తిడిలకు లొంగకుండా పాతబస్తీతో సహా నగరంలోని నలుమూలల రహదారులపై అక్రమంగా వెలిసిన కట్టడాలన్నిం టినీ తొలగిం చాలని నగరవాసులు అందరూ కోరుకుంటు న్నారు. ఆక్రమ ణల తొలగింపుతో గ్రేటర్ రహదారులకు మహా ర్దశ ఏర్పడు తుందని ఆశిస్తున్నారు. ఇలాంటి బహత్కరమైన కార్యమాలను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా కొనసాగిస్తే కబ్జాదారులు మరోసారి అక్రమాలు చేయడానికి సాహసించరు.

# నైన్ జలాల్పూర్ లో గ్రామసభ..






**ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో**

**కొల్చారం,ఏప్రిల్13(సూర్యరేఖ)** ప్రజాపాలన-ప్రగతిప్రాణాలిక99రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ ప్రోగ్రాం ద్వారా గ్రామసభలను నిర్వహించాలి.మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశాల మేరకు ప్రజలకు ప్రాణ రక్షణ కల్పించాలి అనే నినాదంతో కొల్చారం మండలం నాయిని జలాల్పూర్ గ్రామపంచాయతీలో సోమవారం కొల్చారం ఎంపీడీవో రఫిక్ ఉన్నిసాబేగం అధ్యక్షతన గ్రామ సర్పంచ్ దేవి సింగ్,ఉపసర్పంచ్ వెంకట నరసింహులు ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు."అరైవ్ అలైవ్" (ఎర్రివ్ అలీవ్ )వంటి రోడ్డు భద్రత గ్రామ సభను ఉద్దేశించి గ్రామ ఉపసర్పంచ్ వెంకట నరసింహులు మాట్లాడుతూ...ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్,కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని చైతన్యం కల్పించడం చేయాలన్నారు.మద్యం సేవించి,అతి వేగంగా,మొబైల్ ఫోన్ మాట్లాడుతూ...వాహనాలు నడపడం వల్ల జరిగే నష్టాలను వివరించడం చేపట్టాలన్నారు.గ్రామస్థాయి కమిటీలు ద్వారా రిటైర్డ్ టీచర్లు,మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో గ్రామస్థాయిలో రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అనంతరం స్థానిక ఎంపీడీవో నైని జలాల్పూర్ గ్రామంలో నీటి ఎద్దడి గురించి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సర్పంచ్, ఉపసర్పంచ్ గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక,గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు,ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ,ఆశా వర్కర్ నవనీత,అంగన్వాడి టీచర్లు రమాదేవి,ధనమ్మ, వివో, ఏ.సమంత,ప్రజా ప్రతినిధులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం పిహెచ్ సి లో సేవలపై డిఎంహెచ్వో ఆకస్మిక తనిఖీ..







**రామాయంపేట,ఏప్రిల్13(సూర్యరేఖ)** ధర్మారం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మెదక్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీరామ్ సందర్శించి సేవల అమలు తీరును సమీక్షించారు. ప్రజా ఆరోగ్య సేవల నాణ్యతపై డీఎంహెచ్ఓ డా.శ్రీరామ్ ప్రత్యేక దృష్టి సాధించారు.ధర్మారం పీహెచ్సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ,మాతృ ఆరోగ్య సేవల అమలుపై సమగ్రంగా పరిశీలించారు.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన,అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లను సవివరంగా పరిశీలించారు.రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం ఉండాలని సిబ్బందికి సూచించారు.అనంతరం పీహెచ్సీ ప్రాంగణాన్ని పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన గర్భిణీ స్త్రీలతో డా.శ్రీరామ్ నేరుగా మాట్లాడి, మాతృపోషణ,శుభ్రత, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమం లో పీహెచ్సీ సిబ్బందితో పాటు సూపర్వైజర్లు ,ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# సహారాలో డిపాజిట్ చేసిన డబ్బులు చెల్లించాలని బాధితుల ధర్నా..

**మందమర్రి,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** సహారాలో డిపాజిట్ చేసిన డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మందమర్రి పట్టణంలోని మార్కెట్లోని సహారా కార్యాలయం ముందు సోమవారం సహారా బాధితులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.సహారా ఇండియా సంస్థలో ఫిక్స్డ్ డిపాజిట్ చేసిన తమ డబ్బులు కాలపరిమితి దాటిపోయి 4-5 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ చెల్లించకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బాధితులు నల్ల బ్యాడ్జీలు ధరించి,ప్లకార్డులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. "మాడబ్బులు వెంటనే చెల్లించాలి"అంటూ నినాదాలు చేశారు.గడువు కాలపరిమితి పూర్తయినా తమకు డబ్బులు ఇవ్వకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.బాధితులు హెచ్చరిస్తూ, వెంటనే డబ్బులు చెల్లించకపోతే జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.లక్షలాది మంది సహారా బాధితుల సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు.ఈ క్రమంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,తో పాటు స్థానిక ఎమ్మెల్యేలు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం బాధితులు పట్టణంలోని సహారా ఇండియా మేనేజర్కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం,తెలంగాణ ఉద్యమ




కారుల ఐక్యవేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్యతో పాటు సహారా బాధితులు సిహెచ్ సంజీవ్,డి. రాజమౌళి,రామ్ నరేష్ బాబు,సిహెచ్ సంపత్,ఎస్. మధు,దుర్గం మల్లేశ్వరి,భేరి రమాదేవి,దూత లక్ష్మి, పాషా,అబేదా తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ టాపర్ కు ఘన సన్మానం..ఆర్థిక సహాయం అందజేత

**-పద్మశాలి సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్**

**నిజాంపేట,ఏప్రిల్13 (సూర్యరేఖ)** భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి తమ కుటుంబానికి పేరు ప్రతిష్ట తీసుకు రావాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్ పేర్కొన్నారు.సోమవారం నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో స్టేట్ టాపర్ గా ఎంపికైన ఎంపీసీ విద్యార్థి అంబటి లోకేష్ ను ఘనంగా శాలువాతో సన్మానించి నగదు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరాబోయే కాలంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరాడు.ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన లోకేష్ తండ్రికి మాటలు రావు తల్లి తన బిడ్డలను బీడిలు చుదుతూ పిల్లలను పోషిస్తుంది.ఇంతటి నిరుపేద ఇంట్లో ఆణిముత్యంలో ఇంటర్ మొదటి సంవత్సరంలోనే 470కి 466 మార్కుల సాధించి రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు పొందడం హర్షించదగ్గ విషయమని అన్నారు.రామాయంపేట స్నేహ కళాశాలకి కాకుండా రామాయంపేట




ఉమ్మడి మండలానికి వన్నెతెచ్చిన నిరుపేద ఆణిముత్యాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని విద్యనిభ్యసించాలని ఆయన కోరాడు.ఈ కార్యక్రమంలో అంబటి లక్ష్మణ్,గట్టయ్య, మురళి,తిరుమలి,నాగరాజు, సిద్ధిరాములు, నర్సింలు,తిరుపతి,లక్ష్మణ్,ఉన్నారు.

## ప్రజల జీవితాలతో ఆడుకుంటుందో మూసి రివర్ ఫ్రెండ్ పేరుమీద

**జలియన్వాలాబాగ్ అమరవీరులకు ఘన నివాళులు..**



**మందమర్రి,ఏప్రిల్13(సూర్యరేఖ)** జలియన్వాలాబాగ్ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మందమర్రి పట్టణంలో ఘన నివాళు లు అర్పించారు.సోమవారం రిటైర్డ్ ఆర్మీ జవాన్,ప్రస్తుత సింగరేణి ఎస్ అండ్ పి ఉద్యోగి రాజేష్ పిహ్వాల్,రాణి పిహ్వాల్ దంపతుల ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో జలియన్వాలాబాగ్ సంఘటన ఒక మరపురాని విషాద ఘట్టమని పేర్కొన్నారు.1919 ఏప్రిల్ 13న అమృత్సర్లో జరిగిన ఈ హత్యాకాండలో నిరాయుధ ప్రజలు తమ ప్రాణాలను అర్పించడం దేశ స్వేచ్ఛ కోసం చేసిన అత్యున్నత త్యాగానికి నిదర్శనమని తెలిపారు.రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా శాంతియుతంగా సమావేశమైన ప్రజలపై ఎలాంటి హెచ్చరిక లేకుండా కాల్పులు జరపడం మానవత్వాన్ని తలదన్నే ఘటనగా నిలిచిందన్నారు. ఈ దారుణం బ్రిటిష్ పాలన యొక్క క్రూర స్వరూపాన్ని ప్రపంచానికి తెలియజేసిందని పేర్కొన్నారు.జలియన్వాలాబాగ్లో జరిగిన రక్తపాతం,అమాయకుల ఆర్తనాదాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. అమరవీరులు తమ ప్రాణాలను అర్పించి భవిష్యత్ తరాలకు స్వేచ్ఛ అనే విలువైన బహుమతిని అందించారని కొనియాడారు.ఈ సంఘటనతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి కీలక మలుపు వచ్చి, ప్రజల్లో జాతీయ చైతన్యం మరింత పెరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.అమరవీరుల త్యాగాలను ప్రతి సంవత్సరం స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించడం మన బాధ్యత అని పేర్కొన్నారు.

## ఉన్నత ఫలితాలు సాధించిన బీసీ విద్యార్థులకు ఘన సన్మానం..



**మంచిర్యాల,ఏప్రిల్13(సూర్యరేఖ)** మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్లో ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బీసీ విద్యార్థులు కురిమిళ్ళ సాయిచరణ్,ఎర్రవేణి అకిరా జానులను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఆదివారం ప్రకటిం చిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అకిరా జాను 470మార్కులకు గాను 465 మార్కులు,సాయి చరణ్ 470మార్కులకు గాను 464మార్కులు సాధించి మెరిసి మొదటి వరుసలో నిలిచారు.ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో నాయకులు విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అత్యంత వెనుకబడిన కులాలైన నాయి బ్రాహ్మణ, గొల్ల కురుమ కులాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం గర్వకారణమని తెలిపారు.తమ కులవృత్తులు నిర్వహిస్తూ పిల్లలకు ఉన్నత విద్య అందించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని కొనియాడారు.ఆ కష్టాన్ని గుర్తించి విద్యార్థులు చదువులో రాణించి మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదిగి బీసీల స్థితిగతులు మార్చే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, రామగిరి రాజన్నచారి,వేముల అశోక్,తిరుపతి, కురిమిళ్ళ రాజేష్,కురిమిళ్ళ శ్రీనివాస్,అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## దోమల సమస్య పరిష్కరించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్ కు సాయిజెన్ శేఖర్ వినతి



**ఉప్పల్,ఏప్రిల్13 (సూర్యరేఖ)** నాచారం డివిజన్ లోని హెచ్ఎం టినగర్ పెద్ద చెరువు, పటేల్ కుంట చెరువులలో విపరీతమైన గుర్రపు డెక్క పేరుకుపోయిం ది.గుర్రపుటక్క తొలగింపు పనులు చేపట్టడానికి రూ.1.20 కోట్ల నిధులు కూడా మంజూరై సుమారు రెండు నెలలు గడుస్తున్నా గుర్రపు డెక్క తొలగింపు పనులు ఇప్పటికీ చేపట్టలేదని సోమవారం ఉప్పల్ జోనల్ కార్యాలయంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకి రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. అధికారుల అలసత్వం వల్లనే పనులు చేపట్టడం లేదని,తక్షణమే గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభించాలని జోనల్ కమిషనర్,ను కోరడం జరిగింది.సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ వెంటనే అధికారులకు ఫోన్ చేసి తక్షణమే పటేల్ కుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కట్ట బుచ్చన్నగౌడ్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై వాహనాలను జాగ్రత్తగా నడపాలి..

ప్రజల ప్రాణరక్షణ ద్యేయంగా నందగోకుల్ గ్రామం...

గ్రామస్తులకు హెల్మెట్లను పంపిణీ చేసిన

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,జిల్లా ఎస్పీడి.వి. శ్రీనివాసరావు







**నిజాంపేట,ఏప్రిల్13(సూర్యరేఖ)** ప్రజాపాలనా-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలో ఉన్న 492గ్రామపంచాయతీలలో గ్రామసభల ద్వారా అరైవ్-అలైవ్ కార్యక్రమన్ని ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు నిజాంపేట మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో పాలవర్గం ఏకగ్రీవ తీర్మానంగా నోఎంట్రీ-నోహెల్మెంట్ నందగోకుల్ అనే కార్యక్రమనికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మెదక్ కలెక్టర్ ప్రతీమా సింగ్,ఎస్పీడి. వి.శ్రీనివాస్ రావు,హాజరుయ్యారు. గ్రామస్తులు పూలు చల్లుతూ డప్పు చప్పుల మధ్య ఘన స్వాగతంపలికారు. గ్రామంలో ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ పెట్టుకుని గ్రామసభ వరకు ర్యాలీ బయలుదేరా రు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ...గ్రామ ప్రజలప్రాణ రక్షణ ద్యేయంగా నందగోకుల్ గ్రామస్తులు చేసిన ఆలోచన బాగుందని జిల్లా ప్రజలందరూ నందగోకుల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామ పంచాయతీలలో నో హెల్మెంట్-నో ఎంట్రీ అనే కార్యక్రమన్ని చెపట్టాలని కలెక్టర్ సూచించారు .ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి క్షేమంగా ఇంటికి తిరిగి రావాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటిం చాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధన లను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం ,మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. శిరస్త్రాణం (హెల్మెట్),సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు.ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఖచ్చితంగా శిరస్త్రాణం ధరించా లని కోరారు.ఎట్టి పరిస్థితుల్లో నూ మద్యం సేవించి వాహనం నడపకూడదు అని సూచించారు .అనంతరం మెదక్ ఎస్పీ డి.శ్రీనివా సరావు మాట్లాడుతూ. ..దేశవ్యాప్తంగా 1,70,000 మంది రోడ్డు ప్రమాదాల ద్వారా మృతి చెందితే తెలంగాణలో 7000మంది మరణిస్తు న్నారని తెలిపారు.మెదక్ జిల్లాలో హత్యలు అత్యా చారాలు జిల్లాలో సంవత్సరంలో 30జరిగితే,రోడ్డు ప్రమాదా ల ద్వారా350మరణాలు జరుగుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు.రోడ్డు భద్రత నియమా లు పాటించకపోవడం మద్యం సేవించి వాహనాలు నడపడం,సీటు బెల్టు పెట్టుకోక పోవడం తదితర కారణాలవల్ల చాలామంది మృత్యువాత పడుతూ కుటుంబాలకు దూరమవు తున్నారని తెలిపారు.ప్రతి ఒక్కరూ నందగోకుల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని హెల్మెట్ ధరిస్తూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ వాడకంపై హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ ప్రముఖ సినీ నటుల వాయిస్ ద్వారా మిమిక్రీ చేసి అందర్నీ ఆకట్టుకు ంది.ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్,సిఐ వెంకటరాజగౌడ్, తాహసిల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి దేవకుమార్, ఎంపీడీవో భానుప్రకాష్ రెడ్డి,ఉప సర్పంచ్ కుమార్, గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి,తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు,కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,బాల్ రెడ్డి,లింగం గౌడ్,అందే స్వామి ,మ్యాదరి నర్సింలు ,కృష్ణయా దవ్, జ్ఞానేశ్వర్ రెడ్డి,కిషన్,గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

# చిల్కానగర్ లో ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను తొలగించి-ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలి..

ప్రభుత్వ స్థలాలలో.. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి,ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

చిల్కానగర్లో ప్రైవేటు వ్యక్తుల నుండి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి..

తాహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్





**ఉప్పల్,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** చిల్కానగర్ డివిజన్లోని మల్లికార్జున్ నగర్,బొడ్రాయి వెనకాల ఉన్న ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేశారని,దానివల్ల సీవరేజ్ అవుట్లెట్ మూసుకుపోయి చాలా ఇబ్బంది కలుగుతుందని,వారు ఇష్టానుసారంగా సీవరేజ్, స్టార్మ్ వాటర్ డ్రైన్ పైప్ లైన్లను మళ్లించి డివిజన్ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చిల్కానగర్ డివిజన్ ప్రజలతో కలిసి ఉప్పల్ తహసిల్దార్ పూల్ సింగ్ చౌహాన్ కు సోమవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం ప్రవీణ్ ముదిరాజ్ తాహసిల్దార్ తో మాట్లాడుతూ.. .ప్రభుత్వ స్థలాలలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేసి వాటిని అద్దెకు ఇస్తున్నారని అదేవిధంగా వెంటనే తాహసిల్దార్ దీనిపై స్పందించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అక్రమంగా సీవరేజ్ పైప్ లైన్లను తొలగించటం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అవుట్లెట్ లేకుండా సివరేజ్ పైప్ లైన్లను వారి ఇష్టానుసారంగా మార్చుకున్నారని తెలిపారు.ఇదే కాకుండా ప్రైవేట్ పట్టాదారులు వారికి ఉన్న స్థలము కంటే చుట్టుపక్కల ప్రభుత్వ స్థలాలు అన్నిట్లో కూడా నిర్మాణాలు వేస్తున్నారని వాటిని వెంటనే తొలగించి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతి పత్రానికి స్పందిస్తూ తాహసిల్దార్ తక్షణమే ఆర్ఐని పంపించి పర్యవే క్షించమని తెలుపుతానని అదే విధంగా వీలైనంత తొందరలో సర్వే ఏర్పాటు చేసి ప్రభుత్వ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తానని అక్రమ నిర్మాణాలు చేసిన వారిపై, భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో కొండల్ రెడ్డి , జల్లి మోహన్, మల్లికార్జున నగర్ అధ్యక్షులు అశోక్ చారి,మధు, మౌలాలి,భరత్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భవనంతో పాలన మరింత సౌకర్యవంతం..

లచ్యాతండా సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్

నూతన జీపి భవన నిర్మాణ పనుల పరిశీలన





**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** గ్రామపంచాయతీ భవన నిర్మాణంతో గ్రామంలో పాలన మరింత సౌకర్యవంతం కానున్నదని లచ్యా తండా సర్పంచ్ గుగులోత్ సరోజ నరేందర్ నాయక్ అన్నారు.సోమవారం ఆమె మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లచ్యాతండాలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సరోజ నరేందర్ మాట్లాడుతూ...నూతన భవనం ద్వారా గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని,గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలవుతాయన్నారు.గ్రామ పంచాయతీ భవనం ఉండటం వల్ల గ్రామస్థులకు ప్రభుత్వ సేవలను దగ్గరగా,సులభంగా అందించడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించడం జరుగుతుందన్నారు .అదేవిధంగా గ్రామ సభలు, సమావేశాలు నిర్వహించేందుకు,గ్రామ ప్రజల అవసరాలు తీర్చే కేంద్రంగా గ్రామపంచా యతీ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలు ,కార్యదర్శి హారిక,గుగులోతు వీరన్న, తండవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నవరంగ్ గూడకాలనీలో "ఓం శ్రీలక్కీటిఫిన్స్ డస్నాక్స్" ప్రారంభించిన

ఆకారపు అరుణ్ పటేల్





**ఉప్పల్,ఏప్రిల్13(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డివిజన్ నవరంగ్ గూడకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "ఓంశ్రీలక్కీటిఫిన్స్ అండ్ స్నాక్స్"హోటల్ను ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని కోరుతూ,హోటల్ నిర్వాహకులకు తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లింగం,మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్,బాల్ రెడ్డి,రాము,అనిల్,రమేష్, లింగమ య్య,రాజేష్,చోట,సుమీ నాగేష్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅభయాంజనేయ19వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు..



**నిజాంపేట,ఏప్రిల్13 (సూర్యరేఖ)** మండల పరిధిలోని ఖాసింపూర్ గ్రామంలో సోమవారం శ్రీకాశీ విశ్వనాథ అభయాంజనేయ స్వామి దేవాలయం శ్రీఅలివేణి మంగమ్మ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాలాజీ అమెన్స్ కంపనీ ఛైర్మెన్ అందే ప్రతాప్ రెడ్డి,కుమారుడు అందే శ్రీనివాస్ రెడ్డి,దంపతులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకరాజు,ఉపసర్పంచ్ రమేష్,చిన్న నారా గౌడ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చల్మెడ రోడ్డు పనులు ప్రారంభించాలని కలెక్టర్ కు వినతి



**నిజాంపేట,ఏప్రిల్13 (సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామం నుండి నందగోకుల్ గ్రామం వరకు డాంబర్ రోడ్డు పనులు ప్రారంభించాలని,ఇరు గ్రామాల సర్పంచులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ కు వినతి పత్రాన్ని అందించారు.పది సంవత్సరాలుగా కంకర రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని తెలిపారు.త్వరలో రోడ్డు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు విన్నవించగా సానుకూలంగా స్పందించారని, త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, సర్పంచులు బొమ్మన మల్లేశం, భాను ప్రకాష్ రెడ్డి,ఉప సర్పంచ్ ఆకుల మహేందర్,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, లింగం గౌడ్,బొమ్మెన శ్రీనివాస్,మధు,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన నిజాంపేట పాత్రికేయులు..



**నిజాంపేట,ఏప్రిల్13 (సూర్యరేఖ)** మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి జిల్లా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారి నిజాంపేట మండలానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్,జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస్,లను నిజాంపేట జర్నలిస్టులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.జర్నలిస్టులకు గత కొద్ది రోజులుగా పెండింగ్ లో ఉన్నటువంటి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ ప్రతిమ సింగ్ స్థానికులంగానే స్పందించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మహమ్మద్ అజ్గర్,దుబాసి సంజీవ్,చంద్రకాంత్ గౌడ్,భైర వరెడ్డి,శ్రీకాంత్,బాలరాజ్,లు ఉన్నారు.

# ఆకుపై మహనీయుని అద్భుత రూపం సృష్టించిన, మహనీయుడు.







అంబేద్కర్ జయంతికి,అద్భుత బహుమానం..

ఆకు తో "అంబేద్కర్"కు వినూత్న నివాళి..

**ఖమ్మం,ఏప్రిల్13(సూర్యరేఖ)** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మైక్రో ఆర్టిస్ట్ దంతాల సుధాకర్ వినూత్నంగా ఆకును కట్ చేయడం ద్వారా అంబేద్కర్ చిత్రాన్ని రూపొందించి ఘనంగా అంబేద్కర్ కి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా దంతాల సుధాకర్( తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025గ్రహీత )మాట్లాడుతూ...దీన్ని లీఫ్ కటింగ్ ఆర్ట్ అంటారని ఎంతో ఏకాగ్రతగా సృజనాత్మకంగా కట్ చేయాల్సి ఉంటుందని,తాను అంబేద్కర్ పై ప్రత్యేక అభిమానంతో రెండు చిత్రాలు కటింగ్ ద్వారా సృష్టించినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం అంబేద్కర్ జయంతికి తాను వినూత్నంగా ఇలా తయారు చేస్తారని,గతంలో మైక్రో ఆర్ట్ ద్వారా అక్షరాల ద్వారా అంబేద్కర్ చిత్రాన్ని సృష్టించి అక్షర నివాళి అర్పించినట్లు,ఈ సంవత్సరం లీఫ్ కటింగ్ ఆర్ట్ ద్వారా అంబేద్కర్ చిత్రాన్ని సృష్టించినట్లు తెలిపారు. ఒక్కో చిత్రానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది అని తెలిపారు.

## హజ్ యాత్రికుల కోసం శిక్షణ శిబిరం

--వైద్య శిబిరం ముఖ్యఅతిథిగా మహమ్మద్ అలీ షబ్బీర్



**కామారెడ్డి,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో దేవునిపల్లిలోని లక్ష్మీదేవి ఫంక్షన్ హాల్‌లో ఈ ఏడాది హజ్‌కు వెళ్లనున్న యాత్రికుల కోసం హజ్ శిక్షణ శిబిరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగగా,జిల్లాకు చెందిన హజ్ యాత్రికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందారు.ఈ శిక్షణ శిబిరాన్ని ప్రభుత్వ ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ సంక్షేమశాఖల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమాశ్రీనివాస్ పాల్గొని యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మత పండితులు హజ్ యాత్రకు సంబంధించిన ముఖ్యమైన ధార్మిక నియమాలు,విధి విధానాలు,హజ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు,ప్రయాణ ఏర్పాట్లు,వసతి,రవాణా తదితర లాజిస్టిక్ అంశాలపై యాత్రికులకు సమగ్ర అవగాహన కల్పించారు.హజ్ యాత్రలో ఎదురయ్యే సమస్యలు, వాటికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా స్పష్టంగా వివరించారు. మహిళా హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు,ప్రత్యేక కూర్చోవడం మరియు మార్గనిర్దేశం ఏర్పాటు చేయడం విశేషం.శిక్షణ శిబిరంలో పాల్గొన్న హజ్ యాత్రికులు తమ సందేహాలను నేరుగా మత పండితులు, నిర్వాహకులను అడిగి నివృత్తి చేసుకున్నారు.ఈ శిక్షణ శిబిరం వల్ల హజ్ యాత్రను సక్రమంగా,భక్తి భావంతో,సురక్షితంగా నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని యాత్రికులు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ...హజ్ యాత్రికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## మండల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్




**కారేపల్లి,ఏప్రిల్13(సూర్యరేఖ)**సింగరేణి మండల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షుడు భూక్యారంజిత్ పాల్గొన్నారు.ఈ సందర్భ ంగా మడంపల్లి,చర్లపల్లి,వడ్డుగూడెం, గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని రెవెన్యూ మరియు ఆర్‌వైఎఫ్ఆర్ రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా రైతుల వ్యవసాయ భూముల మీదుగా వెళ్తున్న11కెవి విద్యుత్ తీగను తొలగించడం (గుంజుట)అంశంపై తహసీల్దార్,ఫారెస్ట్ రేంజర్, ఎలక్ట్రికల్ ఏఈతో చర్చించారు.ఈ సందర్భంగా తహసీల్దార్,స్పందిస్తూ,సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం 8గంటలకు డిప్యూటీ రేంజర్, ఎలక్ట్రికల్ ఏఈ,రెవెన్యూ జిపిఓ కలిసి సంయుక్త సర్వే జాయింట్ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు సంబంధిత శాఖల అధికారులు. సమన్వయంతో చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

## గోఆరాధనా దినోత్సవం కరపత్రం ఆవిష్కరణ..



**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్13(సూర్యరేఖ)** లంగర్ హౌజ్ డివిజన్ డిఫెన్స్ కాలనీ,రాజీవ్ నగర్ కాలొనీ లోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో భారతీయ జనతా పార్టీ అనుబంధ మహిళ మోర్చా లంగర్ హౌజ్ డివిజన్ అధ్యక్షురాలు కెంసారం సరళ ఆధ్వర్యంలో గోఆరాధనా దినోత్సవం కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గోరక్షణ సంస్థ అధ్యక్షురాలు చంచల్.జి,అతిధులుగా హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్,లు పాల్గొని గోఆరాధనా దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ గావించారు.ఈ సందర్భంగా మహిళ మోర్చా అధ్యక్షురాలు కెంసారం సరళ అతిధులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఏప్రిల్ 27న జరుగనున్న గోఆరాధనా దినోత్సవం ప్రేమికులతో పాటు ప్రతి ఒక్కరు మరిచి పోకుండా గుర్తుపెట్టు కోవాలని కోరారు.ఓ భారతీయులుగా ఆరోజు ఉదయం మన మందరం కలసి గోరక్షణ కోసమై మన జిల్లా కలెక్టర్,మండలాధికారి,మన ప్రియతమ రాష్ట్రపతికి,ప్రధానమంత్రికి,గవర్నర్ కు,ముఖ్యమంత్రి గార్లకు విజ్ఞాపన పత్రమును అందించవలెనని కోరారు.గోసేవా,భద్రత,ఆరాధన,సంరక్షణ ఉద్యమంల సాగాలని గోఆరాధన ఉద్యమ పక్షాన కోరుతున్నామని అన్నారు.

## మరిపెడ సీఐగా పవన్ కుమార్




**మరిపెడ, ఏప్రిల్ 13(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా ఎల్.పవన్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వరంగల్ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీపై మరిపెడకు వచ్చారు.ఇక్కడ పని చేసిన రాజకుమార్ గౌడ్ వరంగల్ ఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పవన్ కుమార్ మాట్లాడుతూ...శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తా మన్నారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరిం చేందుకు కృషి చేస్తామన్నారు.అసాంఘిక కార్యక్రమాలపై గట్టి చర్యలు చేపడతామన్నారు. ఎవరైనా చట్టా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపైన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఐ తెలిపారు.ప్రజలు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఎస్ఐలు,పోలీసు సిబ్బంది నూతన సిఐకి శుభాకాంక్షలు తెలిపారు.

## క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి..

వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి

మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నిర్ధారణ శిబిరం..

40 నమూనాల సేకరణ..



**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** క్షయవ్యాధి లక్షణాలు,చికిత్స,నివారణ గురించి ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం టీబీ (క్షయ)వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి,సుమారు40 స్పూటం ంం(కఫం)నమూనాలను సేకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ...సేకరించిన ఈ నమూనాలను తదుపరి పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రానికి పంపడం జరిగిందని తెలిపారు.పరీక్షల్లో టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వం తరపున 6నెలల పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయడమే కాకుండా,పోషకాహారం కోసం ఆర్థిక సహాయం కూడా అందుతుందని ఆయన పేర్కొన్నారు.రెండు వారాలకు పైగా దగ్గు,సాయంత్రం వేళల్లో జ్వరం,ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఆచార్యులు,ల్యాబ్ టెక్నీషియన్ అనిత,హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య,ఆశా కార్యకర్తలు,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలవికాస సేవలు అభినందనీయం..

బురహాన్ పురం సర్పంచ్ గుగ్గిళ్ళ వెంకటమ్మ-వెంకన్న

బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు..



**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** బాలవికాస సంస్థ సేవలు అభినందనీయమని సర్పంచ్ గుగ్గిళ్ళ వెంకటమ్మ- వెంకన్న అన్నారు. సోమవారం ఆమె మరిపెడ మండలం బురహాన్ పురంగ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో దుస్స ఉమా భర్త దుస్స శ్రీనివాస్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాలవికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వేసవిలో బాటసారులు,ప్రయాణికులు,ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం దోహదపడుతుందని అన్నారు.పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని అన్నారు.చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సహా ఆర్డినేటర్ జజ్జూరి ఉపేంద్ర,గుగులోత్ కవిత,వార్డు సభ్యులు పోసాని జ్యోతి శ్రీను,అవిలయ్య,కొమురయ్య, వెంకన్న,గణేష్, వర్షిత్,రాకేష్,సైదులు,రామ్మూర్తి, లక్ష్మణ్,మహేష్,యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు, గ్రూప్ లీడర్లు,సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలుశుభకార్యాలకు హాజరైన రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల



**కారేపల్లి,ఏప్రిల్13 (సూర్యరేఖ)** సింగరేణి మండల పరిధిలోని సీతారాంపురం గ్రామపంచాయతీ. పేదల సొంతింటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలో నెరవేరుతుంది.పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు.నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్యఅతిది ;గా రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల పాల్గొన్నారు. సీతారాంపు రం గ్రామానికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారు. దారా రజిత ఉపేందర్,కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భ ంగా రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల మాట్లాడుతూ. ..ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభోత్సవం చేసుకోవడం ఎంతో సంతోషకరం,పేదల కళ్ళలో ఆనందం నింపడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని,ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు,పట్టణాలు లేవని అన్నారు.అనంతరం ఉసిరికా యలపల్లి మాజీ సర్పంచ్,ధరంసోత్ పెంటమ్మగారి మనవరాలి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా గంగారం తండా గ్రామంలో రామాలయం గుడి శంకుస్థాపన ప్రారంభించారు.వారితోపాటు నునవత్ నందులాల్ (స్థలం గణేష్,నాగేశ్వరరావు,బన్సిలాల్, తావూర్య,మంగిలాల్, అశోక్, భావుసింగ్, శ్రీను, వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు,గుండ్ల జగన్నా థం సర్పంచ్ మూడు కిషోర్ నాయక్,ఉపసర్పంచ్ మర్సకట్ల నాగేశ్వరరా వు,నాగెండ్ల జగన్,అజ్మీర వీరు నాయక్ బానోత్,సక్రు నాయక్,బోడ రవిజ్యోతి, ధరమ్ సోత్ నాగు జ్యోతి,ఇస్లావత్ శంకర్ నాయక్, బోడ రమేష్ నాయక్,బోడ రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలి...







మద్యం సేవించి వాహనాలు నడిపితే 10వేల జరిమానా..

ఆర్టీఏ విజయలక్ష్మి

**కొల్చారం,ఏప్రిల్13(సూర్యరేఖ)** కొల్చారం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ ఆర్టీఏ విజయలక్ష్మి తెలిపారు.సోమవారం పోలీస్ శాఖ రాంపూర్ గ్రామంలో నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఆర్టీఏ విజయలక్ష్మి ఐసిడిఎస్ పిడి.హేమ భార్గవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గతంలో రాంపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబం చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారని తెలిపారు. ఎక్కడ కూడా మద్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.అందుకు ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పలు రకాల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా హెల్మెట్ లేకుండా వాహనం మద్యం సేవించి నడిపితే పదివేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.18 సంవత్సరాలు నిండని వారిక ఎలాంటి వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు.రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం పెద్దదిగు కోల్పోతుందని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలని సూచించారు. ఎంతోమంది రోడ్డు పక్కన ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని మృతి చెందారని తెలిపారు.అలా కాకుండా పక్కనే ఆపాలని తెలిపారు.అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు.గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ శ్రీనివాస్ చారి,ఎస్సై మహమ్మద్ మోహినోధిన్,ఐసిడిఎస్ సూపర్వైజర్. జయంతి,సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్,గ్రామస్తులు పోచయ్య,గోవర్ధన్ రెడ్డి,కృష్ణ,వాడు సభ్యులు అంగన్వాడి సిబ్బంది మల్లేశ్వరి,బాలమని, మంగమ్మ,సోమశేఖర్,ఆకుల కృష్ణ,యువజన విభాగం అధ్యక్షుడు సందీప్,ఉపాధ్యక్షుడు గురు ప్రసాద్,అనిల్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఉసిరికాయలపల్లి గ్రామంలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారి తీస్తోంది..



**కారేపల్లి,ఏప్రిల్13(సూర్యరేఖ)**సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారి తీస్తోంది.గ్రామానికి చెందిన కోర్సా మల్లయ్య, ఆయన కుమారుడు కోర్సా రాములు సర్వే నంబర్ 548/98/2లో ఉన్న భూమి తమదేనని పేర్కొంటూ న్యాయం కోరుతున్నారు.బాధితుల వివరాల ప్రకారం, ఇల్లు కాలిపోవడంతో జీవనోపాధి కోసం కొంతకాలం గ్రామం విడిచి వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. అనంతరం తిరిగి గ్రామానికి వచ్చాక తమ భూమికి సంబంధించిన పట్టా వేరే వ్యక్తుల పేర్లపై నమోదైందని గుర్తించినట్లు చెప్పారు.దీంతో వారు కలెక్టర్ కార్యాలయం,రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం మరియు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.ఇల్లు కాలిపోయిన విషయం గ్రామస్థులకు తెలిసినదేనని,తమ గైర్హాజరీని కొందరు ఉపయోగించుకొని భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ వద్ద ఉన్న ఆధారాలు భూమి తమదేనని నిరూపిస్తాయని పేర్కొంటూ,అధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే కుటుంబంతో కలిసి తీవ్ర నిర్ణయం తీసుకునే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## క్షేమంగా వెళ్లి క్షేమంగా రండి కార్యక్రమం నిర్వహణ

-- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పోలీస్ శాఖ



**కారేపల్లి,ఏప్రిల్13(సూర్యరేఖ)** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "క్షేమంగా వెళ్లి క్షేమంగా రండి"(అలైవ్ అరైవ్) అవగాహన కార్యక్రమం కారేపల్లిలో జరిగింది.రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కారేపల్లి సబ్ఇన్‌స్పెక్టర్ శ్రీబైరు గోపి మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో కీలకమని తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని,ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించడం,వాహనాన్ని మితమైన వేగంతో నడపడం వంటి అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.అలాగే సింగరేణి ఎంపీడీఓ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ...ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.ప్రతి కుటుంబం రోడ్డు భద్రతపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోత్ భీముడు నాయక్ మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నివారణలో అవగాహన కచ్చితంగా పాటించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని కోరారు.మొత్తంగా ఈ కార్యక్రమం రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది.పోలీస్ శాఖ చేపట్టిన ఈ ప్రయత్నాన్ని స్థానికులు అభినందించారు.

## రోడ్డు భద్రతపై చిర్రకుంటలో గ్రామసభ..




**మందమర్రి,ఏప్రిల్13(సూర్యరేఖ)** ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం,తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చిర్రకుంట గ్రామపంచాయతీలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం గ్రామసభను నిర్వహించారు.ఈ గ్రామసభలో వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా నియమాలను పోలీస్ అధికారులు వివరించారు. మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన యువతీ యువకులే వాహనాలు నడపాలని,ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం పూర్తిగా నిషేధమని,కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు.అలాగే మైనర్ యువతకు వాహనాలు ఇవ్వడం లేదా వారు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని,రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్డు పక్కన గల పిచ్చి మొక్కల తొలగింపు చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంటేంకి శ్రీలత, తిరుపతి, ఉపసర్పంచ్ గిర్నాటి జనార్ధన్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్ధం జనార్ధన్, సీనియర్ నాయకులు,యువకులు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,అంగన్వాడి,ఆశా వర్కర్లు,గ్రామపంచాయతీ సిబ్బంది,రోడ్డు భద్రత కమిటీ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంటర్ టాపర్ కు ఘన సన్మానం..

ఆర్థిక సహాయం అందజేత..

పద్మశాలి సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్



**నిజాంపేట,ఏప్రిల్13(సూర్యరేఖ)** భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి తమ కుటుంబానికి పేరు ప్రతిష్ట తీసుకు రావాలని పద్మశాలి సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్ పేర్కొన్నారు.సోమవారం నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో స్టేట్ టాపర్గా ఎంపికైన ఎంపీసీ విద్యార్థి అంబటి లోకేష్ ను ఘనంగా శాలువాతో సన్మానించి నగదు అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ...రాబోయే కాలంలో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరాడు.ఓ నిరుపేద కుటుంబంలో జన్మించిన లోకేష్ తండ్రికి మాటలు రావు తల్లి తన బిడ్డలను బీడిలు చుడుతూ పిల్లలను పోషిస్తుంది.ఇంతటి నిరుపేద ఇంట్లో ఆణిముత్యంలో ఇంటర్ మొదటి సంవత్సరంలోనే 470కి466 మార్కుల సాధించి రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు పొందడం హర్షించదగ్గ విషయమని అన్నారు. రామాయంపేట స్నేహ కళాశాలకి కాకుండా రామయంపేట ఉమ్మడి మండలానికి వన్నెతెచ్చిన నిరుపేద ఆణిముత్యాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని విద్యనిభ్యసించాలని ఆయన కోరాడు.ఈ కార్యక్రమంలో అంబటి లక్ష్మణ్,గట్టయ్య,మురళి తిరుమల నాగరాజు,సిద్ధిరాములు,నర్సింలు, తిరుపతి,లక్ష్మణ్ ఉన్నారు.

## పిల్లల కోసం సర్పంచ్ సాయహస్తం..



**చెన్నూర్.,ఏప్రిల్13(సూర్యరేఖ)** భీమారం గ్రామ సర్పంచ్ ఉష్కమల్ల విజయలక్ష్మి పున్నం చందు కుమారుడు అలోక్ సాయి పుట్టినరోజు సందర్భంగా,ఎంపీపీఎస్ కొత్తగూడెం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కు ఉపయోగపడే విధంగా రూ.5,000లను అందజేశారు.ఎండ వేడి కారణంగా పిల్లలు కూర్చోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యం లో,రేకులు కొనుగోలు చేయడానికి ఈ మొత్తాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని సర్పంచ్ సేవాభావాన్ని అభినందించారు.

## భీమారం మండలంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం..

సెల్ఫోన్ డ్రైవింగ్‌కు చెక్--యువతకు సూచనలు

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



**చెన్నూర్,ఏప్రిల్13(సూర్యరేఖ)** భీమారం మండలంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు .సెల్ఫోన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకరమైన అలవాట్లను మానుకోవాలని, రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా,రోడ్డు ప్రమాదాలను నివారించడంపై దృష్టి సారించారు.ముఖ్యంగా,యువతలో సెల్ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు పూర్తి అప్రమత్తతతో ఉండాలని, రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు.వివిధ ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించ బడుతోంది. విద్య,రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు.మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలను కూడా ఈ సందర్భంగా గుర్తు చేశారు.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని,ఏప్రిల్ నెలాఖరు వరకు భీమారం మండలంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగకుండా చూడాలనే లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశారు.ప్రమాదకరమైన మలుపుల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని,తద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించాలని ప్రణాళికలు రూపొందించారు.ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం రోడ్డు భద్రతా చర్యలను పాటించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు,రాజేందర్,సర్పంచ్ పుష్పమల్ల విజయలక్ష్మి,ఎంఈఓ,ఎంపీడీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## రాంపురం గ్రామ ఎంఆర్ పిఎస్,ఎంఎస్ఎఫ్ నూతన కమిటీలు ఎన్నిక





**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామ ఎంఆర్ పిఎస్,ఎంఎస్ఎఫ్ నూతన కమిటీలను అంబేద్కర్ కాలనీ పెద్దల సమక్షంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎంఆర్ పిఎస్ కమిటీ అధ్యక్షుడిగా బందు వీరన్న, ఉపాధ్యక్షుడిగా పాల్వాయి యాకన్న,ప్రధాన కార్యదర్శిగా చింత వీరన్న, గౌరవ అధ్యక్షులుగా బందు పరశురాములు, బందు రామన్న,చింత వెంకన్న,పాల్వాయి ఎల్లయ్య, ఎంఎస్ఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా బందు కృష్ణ మాదిగ, ఉపాధ్యక్షుడిగా పాల్వాయి రామయ్య,ప్రధాన కార్యదర్శిగా గుండెపాక రాంబాబు,గౌరవ అధ్యక్షులు బందు యాకయ్య,చింత రమేష్, పాల్వాయి నాగయ్యలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కాలనీ పెద్దలు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్లో నెలకొన్న మంచినీటి,డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన





కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ బృందం

**ఉప్పల్,ఏప్రిల్13(సూర్యరేఖ)**ఉప్పల్ బీరప్పగడ్డలోని జలమండలి కార్యాలయంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్,డీజీఎం. వేణుగోపాల్ ,లను మల్లాపూర్ ఏ.ఈ.శ్రీరోహిత్ తో కలిసి కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి మరియు డ్రైనేజ్ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా "బస్తీబాట" కార్యక్రమంలో ప్రజలు వ్యక్తపరిచిన ప్రధాన సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.కేఎల్ రెడ్డి, హెచ్ సిఎల్ కాలనీ, అన్నపూర్ణ,భవానినగర్ కాలనీలలో తక్కువ ప్రెషర్తో తాగునీటి సరఫరా జరుగుతోందని,ఓల్డ్ మల్లాపూర్లో మదీనా చికెన్ సెంటర్ ఎదురుగా కొత్త వాటర్ లైన్ మరియు కొత్త కనెక్షన్లు ఏర్పాటు ఏర్పాటు చేయాలని కోరారు.పలు కాలనీలలో కొత్త డ్రైనేజ్ లైన్ల ఏర్పాటు అవసరమని వారి దృష్టికి తీసుకువచ్చారు.ఆయా సమస్యలపై స్పందించిన జీఎం సంతోష్ కుమార్ వీటిని అత్యవసరంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నెమలి అనిల్ కుమార్ కృషి పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్ ,శంకర్ గౌడ్,పిడిశెట్టి సురేష్ ,అన్వర్ పఠాన్,సాయికుమార్, రషీద్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బురహన్ పురం గ్రామ పంచాయతీ పరిధిలోని వాచ్య తండాకు చెందిన బానోతు నాగయ్యనాయక్ (లేట్), లక్ష్మీదంపతుల కుమారుడు మధు-వెన్నెల వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకకు ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు, నాయకులు మచ్చ వెంకట నర్సయ్య,నల్లు శ్రీకాంత్ రెడ్డి,తేజావత్ భరత్ కుమార్,యూత్ మరిపెడ మండల అధ్యక్షుడు బానోత్ నరేష్,మచ్చ నాగేశ్వర్ రావు,సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆరెల్ల జంగ్లయ్య చిత్ర పటానికి ప్రముఖుల ఘన నివాళులు..





**నాంపల్లి,హైదరాబాద్,ఏప్రిల్13 (సూర్యరేఖ)** ప్రముఖ సీనియర్ సంఘ సేవకులు,డిఫెన్స్ కాలోనీ హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్,లంగర్ హౌస్ యాదవ్ సంఘం సీనియర్ సలహాదారులు,లంగర్ హౌస్ బస్తీ అత్యంత సన్నిహితులు,సలహాదా రులుగా సేవలందించిన ఆరెల్ల జంగ్లయ్య యాదవ్ దశ దిన కర్మకార్యక్రమం లంగర్ హౌస్ డీఫోర్ట్ ఫంక్షనల్ లో కుమారులు ఆరెల్ల జంగయ్య,శ్రీశైలం యాదవ్,వెంకటేష్ యాదవ్,కృష్ణ యాదవ్,ఆరెల్ల కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీ,హెఛ్ వినోద్ సింగ్,ఏఐఎంఐఎం పార్టీ కార్వాన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వామి యాదవ్,ప్రముఖ సంఘ సేవకురాలు శోభా పాండే,బీజేపీ ,కాంగ్రెస్, బిఆర్ఎస్,ఏఐఎంఐఎం పార్టీ శ్రేణులు,వివిధ ప్రాంతాల బస్తీ ప్రముఖులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి,ఆయన సేవలను కొనియాడారు.కుటుంబం సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.

## మాకుల జాతర'లో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏ ర్పాటు..

మరిపెడ సీఐ పవన్ కుమార్

జాతరకు వచ్చే భక్తుల భద్రత,ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు పరిశీలన





**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** మాకుల జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ శివారులోని శ్రీమాకుల వేంకటేశ్వరస్వామి పారువేట (జాతర) సందర్భంగా జాతర ప్రాంగణాన్ని ఎస్ఐ వీరభద్ర రావుతో కలసి పరిశీలించి భక్తుల భద్రత,ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు,రద్దీ నియంత్రణ చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా సీఐ పవన్ కుమార్ మాట్లాడుతూ...మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల వెంకటేశ్వరస్వా మివారి జాతర సందర్భంగా భారీగా తరలివస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.జాతర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భక్తులు పోలీస్ సూచనలు పాటిస్తూ సహకరించాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరభద్రరావు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం..అక్కన్నపేట చెరువులో మౌనంగా మిగిలిన ఓ మనిషి జీవగాథ



**రామాయంపేట,ఏప్రిల్13 (సూర్యరేఖ)** అక్కన్నపేట గ్రామ శివారులోని ప్రశాంతమైన కొత్తచెరువు ఒక్కసారిగా విషాద వాతావరణానికి నిలయమైంది.తెలియని మనిషి మృతదేహం నీటిమీద తేలియాడుతూ కనిపించడంతో గ్రామం గుండె ఒక్కసారిగా దిగులుతో నిండిపోయిం ది.ఎవరో ఒకరి ఇంటి ఆశగా ఎదురు చూసే మనిషి,ఇక్కడ ఒంటరిగా,గుర్తుతెలియని శవంగా మారడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.గ్రామపంచాయతీ వర్కర్ ముత్యం రాజు చెరువు వద్ద పనుల నిమిత్తం వెళ్లినప్పుడు,నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించాడు.వెంటనే ఆయన ఈ విషయాన్ని అక్కన్నపేట గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎర్రన్నగారి సరితా దేవికి ఫోన్ ద్వారా తెలియజేశారు. సమాచారం అందుకున్న సరితాదేవి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, నిజంగానే చెరువులో ఒక మగ మనిషి శవం ఉన్నట్లు నిర్ధారించారు.దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతుని వయస్సు సుమారు 35 నుండి 45 సంవత్సరాల మధ్యగా అంచనా వేస్తున్నారు.శవంపై ముదురు ఆకుపచ్చ మరియు నలుపు రంగు గీతల ఫుల్ షర్టు,ఎరుపు రంగు బనియన్,బ్లూ జీన్ ప్యాంట్,అలాగే చిలకపచ్చ రంగు లుంగీ ఉన్నాయి.శవం పరిస్థితిని బట్టి, సుమారు నాలుగు నుంచి ఐదు రోజుల క్రితమే నీటిలో మునిగి ఉండి,ప్రస్తుతం కుళ్లిన దశలో ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడి వివరాలను గుర్తించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే,వెంటనే ఎస్సై రామాయంపేట (8712657 934) లేదా సీఐ రామయంపేట (8712657933)ను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మినీ ట్యాంకు నిర్మాణ పనులకై భూమి పూజ..



**నిజాంపేట,ఏప్రిల్13(సూర్యరేఖ)** ంమండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వేసవికాలంలో నీటికొరత ఎర్పడకుండా ఉండడానికి మినీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి భూమి కార్యక్రమం చేపట్టడం జరిగిందని గ్రామ సర్పంచ్ పోన్న బోయిన ప్రవీణ్ తెలిపారు.ఈ కార్యక్రమములో వార్డు సభ్యులు దొంతరబోయిన బాల్ రాజు,రుద్రారం సతీష్ గౌడ్,ఎండి ఫిరోజ్, పొన్నబోయిన రాములు, గుర్రం శిరీష,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన అందే ప్రతాప్ రెడ్డి..




**నిజాంపేట,ఏప్రిల్13(సూర్యారేఖ)** మండల పరిధిలోని రజాక్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ఖాసింపూర్ గ్రామంలో అందే శకుంతలా దేవి పేరుమీద కమ్యూనిటీ హాల్ ను శ్రీబాలాజీ అమెన్స్ కంపనీ వారి ఆధ్వర్యంలో నిర్మించబడ్డ కమ్యూనిటీ హాల్ ను సోమవారం అందే ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.గ్రామానికి కమ్యూనిటీ హాలు కృషిచేసిన ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ కనకరాజు సన్మానించి గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రమేష్,సత్యనారాయణ, రామచంద్రం,నారాగౌడ్, కొమురయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నకలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే నా ద్యేయం..

అప్పాజీపల్లి సర్పంచ్ వెంకట్ గౌడ్ (గజిని)



**కొల్చారం,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** ఎన్నకలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే నా దేయమని మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్(గజినీ) అన్నారు.ఎన్నికల్లో ఇచ్చినహామీ ఆడపిల్ల జన్మిస్తే 5116/రు ప్రోత్సహం ఇస్తాను అని మాట ఇచ్చానని సర్పంచ్ వెంకట్ గౌడ్ (గజినీ) తెలిపారు. అప్పాజీపల్లి గ్రామంలో సోమవారం శివలింగారి గ్యానేశ్వర్ కు కూతురు పుట్టడంతో వారికీ 5116అందజేశారు.ఈ సందర్భంగా నాయిని వెంకట్ గౌడ్ గజిని తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చెలం నర్సింలు,వార్డ్ సభ్యులు సదాల నర్సింలు,వార్డ్ మెంబెర్ మానేపల్లి సావిత్రి,కదూరి సుశీల,సదాల నర్సింలు,రామాంజం, పంచాయతీ సెక్రటరీ పణింద్ర,దాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూర్‌లో పేకాట రైడ్--9మంది అరెస్ట్



**చెన్నూర్,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** చెన్నూర్ పట్టణంలోని చాకలి బజార్ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేశారు.పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్ఐ,లు శ్యామ్ పటేల్, సుబ్బారావు సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ దాడిలో అయిటిపాముల ప్రశాంత్,పెదకొండ నరేష్,ముత్తన్నపల్లి సాగర్, పెదకొండ మహేష్, ఐటీపాముల శంకర్,అడ్డురి ప్రేమ్‌కుమార్,చిప్పకుర్తి రమేష్, తగరం సంతోష్, ఎండీ నిజముద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇంకొక వ్యక్తి తగరం మహేందర్ పారిపోయినట్లు పోలీసులు తెలిపారు.వారి వద్ద నుండి రూ.9,500 నగదు మరియు 6మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పారిపోయిన వ్యక్తితో కలిపి మొత్తం10 మందిపై కేసు నమోదు చేసి,9మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పరారీలో ఉన్న వ్యక్తిని త్వరలో పట్టుకుంటామని తెలిపారు.చెన్నూర్ పట్టణంలో లేదా పరిసర గ్రామాల్లో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రెండుసార్లు పట్టుబడిన వారిపై రౌడీ షీట్ కూడా తెరవబడుతుందని తెలిపారు.

# భీమారం మండలంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం..

సెల్ఫోన్ డ్రైవింగ్‌కు చెక్--యువతకు సూచనలు
రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి..



**చెన్నూర్,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** భీమారం మండలంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సెల్ఫోన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకరమైన అలవాట్లను మానుకోవాలని, రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా,రోడ్డు ప్రమాదాలను నివారించడంపై దృష్టి సారించారు. ముఖ్యంగా,యువతలో సెల్ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు పూర్తి అప్రమత్తతతో ఉండాలని,రహదారి నియమాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. వివిధ ప్రభుత్వశాఖల సహకారంతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబ డుతోంది. విద్య,రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారు. మద్యం దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన నిబంధనలను కూడా ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని,ఏప్రిల్ నెలాఖరు వరకు భీమారం మండలంలో ఒక్క రోడ్డు ప్రమాదం కూడా జరగకుండా చూడాలనే లక్ష్యంతో ప్రతిజ్ఞ చేశారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించాలని ప్రణాళికలు రూపొందించారు. ప్రజలందరూ తమ ప్రాణాల రక్షణ కోసం రోడ్డు భద్రతా చర్యలను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్లు,ఎస్ఐ రాజేందర్,సర్పంచ్ ఉష్కామల్ల విజయలక్ష్మి, ఎంఈఓ, ఎంపీడీవో మధుసూదన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో రవాణా శాఖ చైతన్య కార్యక్రమాలు

బార్ అసోసియేషన్ నూతన కమిటీకి ఎమ్మెల్యే శుభాకాంక్షలు




**మంచిర్యాల,ఏప్రిల్13సూర్యరేఖ):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 వ రోజుల కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 13 వ తేదీ నుంచి 18 వ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల సందర్భంగా "అరైవ్-అలైవ్" రోడ్డు భద్రత పోస్టర్లను సోమవారం మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలు రోడ్డు నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యుడు అంకతి శ్రీనివాస్,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రంజిత్ రెడ్డి,కిషోర్ చంద్ర రెడ్డి,ఆర్టీవో అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే 2026-27 సంవత్సరానికి మంచిర్యాల జిల్లా బార్ అసోసియేషన్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొత్త సత్తయ్య,ప్రధాన కార్యదర్శి అవునూరి సత్తయ్యతో పాటు కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఎమ్మెల్యేకు గజమాల వేసి సన్మానించారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే,న్యాయవాదుల న్యాయం కోసం కృషి చేస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## సురక్షిత ప్రయాణం..కుటుంబానికి భరోసా..'





**బెల్లంపల్లి,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్,1టౌన్ అధికారులు సూచించారు. బెల్లంపల్లిలోని 33వ వార్డు హనుమాన్ బస్తీలో సోమవారం రోడ్డు భద్రతపై ప్రత్యేక వార్డు సభ నిర్వహించారు. స్థానికులతో రహదారి నియమాలపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు,నిర్లక్ష్యం ప్రాణాలకు ముప్పు తెస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు. సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా అని ,అనుభవ వైద్యులు పోలు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోలు ఉమాదేవి,ఆశ వర్కర్ స్వప్న పోలు శ్రీనివాస్,గోమాస క్రాంతి,పోలీస్ అధికారులు,వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## డీఆర్డీఓ చేతుల మీదుగా క్యాష్ అవార్డు అందుకున్న ఇస్లావత్ హాథిరాం..





**కారేపల్లి,ఏప్రిల్13సూర్యరేఖ):** కారేపల్లి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ ఆలియా తండాకు చెందిన ఇస్లావత్ హాథిరాం డీఆర్డీఓ చేతుల మీదుగా క్యాష్ అవార్డును అందుకున్నారు. ఈజీఎస్ అటెండెన్స్ పరంగా రాష్ట్రస్థాయి,జిల్లా స్థాయిలో ఫస్ట్,సెకండ్ రావడంతో ఆయనకు ఈ రివార్డు దక్కింది. ఈ మేరకు ఎంతో ఆనందంగా ఉందని ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ హాథిరాంను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు వార్డు సభ్యురాలు తేజావత్ ప్రమీల,మాజీ వార్డు సభ్యులు చందర్,బోడ హీరాలాల్ నాయక్,మూడు అలేఖ్య,బానోతు సరోజ,మండల వాణి,ఫీల్డ్ అసిస్టెంట్ కమల,మేట్స్ బాలు,జాల వెంకన్న ,రెడ్డబోయిన బిక్షం యాదవ్,గ్రామపంచాయతీ ఈజిఎస్ వర్కర్స్ అందరూ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు బిడ్డకుస్టేట్ ర్యాంక్

విద్యార్థినిని అభినందించిన ఖాన్ ఖాన్ పేట గ్రామ ప్రజలు





**ఖమ్మం,ఏప్రిల్13సూర్యరేఖ):** రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన కల్లూరులో విద్యార్థిని సానిక లక్ష్మీ సంజన(436/440)ని మండల బిజెపి నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని ఖాన్ ఖాన్ పేటకు చెందిన పేద రైతు సానిక శ్రీనివాసరావు,ఉషారాణి దంపతుల కుమార్తె సానిక లక్ష్మీ సంజన ఇంటర్ ఫలితాల్లో బైపీసీ మొదటి సంవత్సరం రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించడంతో విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు వారి గృహానికి వెళ్లి విద్యార్థిని ఆశీర్వదించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ మాట్లాడుతూ..భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. గతంలో పదో తరగతి ఫలితాల్లో కూడా స్కూల్ ఫస్ట్,మండల రెండవ ర్యాంకు సాధించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం సంజన తను చదువుతున్న ఖమ్మం పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం క్యాంపస్ మొదటి స్థానాన్ని దక్కించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంటర్ ఫలితాలు స్టేట్ రెండవ ర్యాంకు సాధించి మండలానికి,ఖాన్ ఖాన్ పేట గ్రామానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చిందని అందుకు గ్రామస్తులు మండల ప్రజలు గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండవ వెంకటరామిరెడ్డి ,పానుగంటి కృష్ణయ్య,తుమ్మలపూడి పెద్ద పుల్లారావు, గుండపనేని అనిల్,జంగిల్ దుర్గాప్రసాద్,జరుపులా నాగులు,భూక్య రాజ్ కుమార్,కేలోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసం చర్యలు వేగవంతం చేయాలి..

యోగితా రాణి

**కామారెడ్డి,ఏప్రిల్13(సూర్యరేఖ)** జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితా రాణా ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఈమేరకు ఆమె జిల్లా.కలెక్టర్లు,డీఈ వోలు,టీజీడబ్లుడీఎస్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో కేజీ నుండి పీజి వరకు విద్యార్థులు చదువుకోవడానికి అనుకూలంగా ఉండే విధంగా ప్రభుత్వ పాఠశాల ఎల్లారెడ్డి ప్రాంగణాన్ని పరిశీలించి అందుకు అవసరమైన మౌలిక వసతులు,స్థలం పరిశీలించి లైన్ ఎస్టిమేషన్లను వెంటనే రూపొంది ంచవలసిందిగా ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీఆశిష్ సంగ్వాన్, డిఈవో, ఇంజనీ రింగ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పుతున్న ఈ పాఠశాల ఏర్పాటులో త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్



**కామారెడ్డి,ఏప్రిల్13(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ అన్నారు .కామారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని ఆమె అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆమె సూచించారు .పార్టీలో కష్టపడే వారికి ప్రతిఫలం ఉంటుందని ఆమె అన్నారు. కామారెడ్డి నియోజకవర్గం జిల్లాలోని శాసనసభ్యులు ఎమ్మెల్సీలు ప్రభుత్వ సలహాదారులతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఆమె అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని ఆమె తెలిపారు.

## ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ను కలిసిన సిఐ పవన్ కుమార్



**మరిపెడ,ఏప్రిల్13(సూర్యరేఖ)** ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ ను సోమవారం మరిపెడ మండల కేంద్రంలో మరిపెడ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీఐ పవన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ పవన్ కుమార్ కు ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ డా.శబరీష్ ను కలిసిన మరిపెడ సిఐ పవన్ కుమార్ మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్ ను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మరిపెడ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఎల్.పవన్ కుమార్ మర్యాదపూర్వకముగా కలిసి మొక్కను అందజేశారు.

## అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచిన పలువురు బీజేపీ నాయకులు



**రాజేంద్రనగర్,ఏప్రిల్13(సూర్యరేఖ)** మహనీయుల ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని గోల్కొండ ఇన్చార్జ్ వైస్ శ్రీధర్ అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరిచడంతో పరిసరాలలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ....బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని స్మరించుకోవాల్సిన ఎంతైనా ఉందని అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని వాటి అమలు కోసం పని చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కోరని సదానంద,మాజీ అధ్యక్షుడు బాబురావు,జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వనితారెడ్డి,జిల్లా ఎస్సీ మోర్చా రవీందర్,బండారి బాలకృష్ణ,శశి,శ్రీనివాస్ రెడ్డి,సరిత రెడ్డి,కవిత,పద్మావతి ,వేణుగోపాల్, విజయ్ యాదవ్, పెంటయ్య ,షేక్ బాషా ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా రామంతాపూర్‌లో 99రోజుల ప్రత్యేక కార్యాచరణ నిర్వహణ..







పోలీసుల అవగాహన సదస్సుతో ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో చైతన్యం..

గ్రామాభివృద్ధి,భద్రత కోసం ప్రజల సహకారం అవసరం: సర్పంచ్ భవాని సౌందర్య రఘుపతి

**మసాయిపేట,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల ప్రత్యేక కార్యాచరణను రామంతాపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు.గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఈ గ్రామ సభలో ప్రజాప్రతినిధులు,పోలీసు అధికారులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు ప్రజల్లో చైతన్యం కలిగించింది.విలేజ్ పోలీస్ ఆఫీసర్ మహేష్ మాట్లాడుతూ...ప్రాణం ఎంతో విలువైనదని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.ముఖ్యంగా గ్రామీణ యువత అతివేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు.గ్రామ సర్పంచ్ భవాని సౌందర్య రఘుపతి మాట్లాడుతూ.. .ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరవేయడంలో పోలీసుశాఖ చేస్తున్న కృషిని అభినందించారు.99 రోజుల ప్రణాళిక ద్వారా గ్రామాల్లో క్రమశిక్షణ, భద్రత,అభివృద్ధి సాధ్యమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొలుగు విజయ సంతోష్ రెడ్డి,వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుభ్రత కార్యక్రమం..





పాల్గొన్న బీజేపీ నాయకులు

**రాజేంద్రనగర్,ఏప్రిల్13(సూర్యరేఖ):** అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని,సమాజ అభివృద్ధికి కలిసి పనిచేయాలని ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి అన్నారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం జరగనున్న వేడుకలను పురస్కరించుకొని సోమవారం బీజేపీ నాయకులు,కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ మైలతీర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విగ్రహం పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచి,పుష్పాలతో అలంకరించి అంబేద్కర్ పట్ల గౌరవాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ..సమాజానికి సమానత్వం,న్యాయం అనే విలువలను అందించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు.అలాంటి మహనీయుడి జయంతిని ఘనంగా నిర్వహిందుకు ఈ శుభ్రత కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు అడికే రాజు,జిల్లా కన్వీనర్ వెంకట్ రమణ గుప్తా,బొమ్మ రాజు నరసింహ,గూడూరి అంజి,కొండాల ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో నిర్వహించిన రక్తదాన శిభిరం జయప్రదం



**శ్రీరాంపూర్,ఏప్రిల్13సూర్యరేఖ):** మహాత్మా జ్యోతిబా పూలే,డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ జయంతులను పురస్కరించుకుని శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మహనీయుల స్పూర్తితో నిర్వహించిన మెగా రక్తదాన శిభిరం జయప్రదం అయ్యింది.సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున యువ కార్మికులు హాజరై రక్తదానం చేశారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ..కార్మికుల సమస్యలపై పోరాటాలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా మహనీయుల స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.సుమారు 150 మందికి పైగా యువ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమన్నారు .తలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతి నెల రక్తం అవసరం అవుతుందని,అలాంటి వారికి ఈ శిభిరం ద్వారా సహాయం అందుతుందని తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో గతంలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా మందమర్రిలో కూడా రక్తదాన శిబిరం నిర్వహించామని గుర్తుచేశారు.యువత నుంచి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని కోల్ బెల్ట్ ప్రాంతంలోని ఇతర ఏరియాల్లో కూడా త్వరలో ఇలాంటి శిబిరాలు,మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే సింగరేణి యాజమాన్యం నిర్వహించే పీఎం ఈ పరీక్షల్లో విటమిన్ లోపం,కిడ్నీ,లివర్ సంబంధిత పరీక్షలను కూడా చేర్చాలని సూచించారు.రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన యువకులను యూనియన్ తరపున అభినందించారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ,కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్,మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు సాంబార్ వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్‌తో పాటు నాయకులు సాయిల శ్రీనివాస్,పెరుక సదానందం,మిడివెలి శ్రీనివాస్,తోడే సుధాకర్ ,మెల్లం శ్రీధర్,శ్రీపతి బానిష్,వెంకట్ రెడ్డి,ఇప్ప నరేష్,సమ్మయ్య ,ప్రవీణ్, నవీన్, సిరికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతి..




**బెల్లంపల్లి,ఏప్రిల్13(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణ పరిధిలోని బట్వాన్‌పల్లి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు.ఏడో వార్డు సభ్యుడు సోము,బీఆర్ఎస్ నాయకుడు వినోద్ సోమవారం విద్యుత్ శాఖ రూరల్ ఏఈకి వినతి పత్రం అందజేశారు.గ్రామంలో తరచూ విద్యుత్ అంతరాయాలు,లో వోల్టేజ్ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వారు వివరించారు.దీనిపై స్పందించిన ఏఈ,సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## బంజారా భవన నిర్మాణం చేపట్టాలి

ప్రజావాణిలో కోరిన గిరిజన సంఘాల నాయకులు



**నారాయణపేట,ఏప్రిల్13సూర్యరేఖ):** నారాయణపేట ఎర్రగుట్టలోని తొమ్మిదవ వార్డులో బంజారా భవన నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్,ఆర్డీవో,నారాయణపేట నియోజకవర్గం శాసనసభ సభ్యురాలు వర్ణిక రెడ్డి పర్సనల్ పీఏ మాధవ రెడ్డిలను గిరిజనులు కోరారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ..నారాయణపేట ఎర్రగుట్టలోని తొమ్మిదవ వార్డులో బంజారా భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణం కొరకు జీవో నెంబర్ 332 ద్వారా రూ.కోటి గత ప్రభుత్వంలో మంజూరయ్యాయని,అయితే ఆ జీవో క్యాన్సల్ అవ్వడం జరిగిందన్నారు.ఈ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోతుందని,ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని,ఇప్పటికైనా స్పందించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ మేరకు సానలుకూంగా స్పందించి బంజారా భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వివరించారు.

## గ్రామాభివృద్ధి లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..



**శివంపేట,ఏప్రిల్13(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని గుండ్లపలి లో సోమవారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అభివృద్ధి పనులపై గ్రామస్థులతో చర్చించారు.గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ పెంజర్ల మమత కోరారు.ఈ కార్యక్రమంలో ఐకెపి స్పెషల్ ఆఫీసర్ నర్సింలు,గ్రామ కార్యదర్శి సంతోష్,ఉపసర్పంచ్ సత్యనారాయణ ,వార్డు సభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కమిటీల ఏర్పాటు..

ఎస్సై మధుకర్ రెడ్డి



**శివంపేట,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన 'డ్రైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.ప్రమాదాలను అరికట్టేందుకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఆయా కమిటీలు అప్రమత్తంగా ఉండి రోడ్డుభద్రతకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజపేట వెంకటేష్,ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేష్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ,అధికారులు,యువకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం-రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం:





**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**గ్రామం బాగుంటే దేశం బాగుంటుంది**

**99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమం**

**దామరగిద్ద,ఏప్రిల్13సూర్యరేఖ):** గ్రామ సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు కంకణబద్దులు కావాలని,వాహనదారులు డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ దామరగిద్ద గ్రామసభలలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో, అరైవ్అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను నియంత్రించడం,ప్రజల్లో ట్రాఫిక్ నియమాల పట్ల బాధ్యతాభావం పెంపొందించడం లక్ష్యంగా "అరైవ్ అలైవ్ " కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుంచి 18 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజు దామరగిద్ద టౌన్,గుండుమల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ..ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం,ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు అతివేగం,మద్యం సేవించి వాహనం నడపడం,డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం,ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలేనని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనం నడిపి,తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని తెలియజేసారు.ఇతర మరణాల కంటే రోడ్డు ప్రమాద మరణాలు ఎక్కువగా అవుతున్నాయని రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నాయని ,వీటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరు డిఫెన్స్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కృషి చేయాలని,ఈ కృషి అనేది ప్రతి గ్రామం నుండి మొదలవ్వాలని గ్రామం బాగుంటేనే దేశం బాగుంటుందని తెలియజేశారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసేటటు వంటి పాంప్లెంట్లు,పోస్టర్లను విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య,సీఐలు శివశంకర్,సైదులు, ఆర్టీవో మెగా గాంధీ,ఎమ్మార్వో తిరుపతయ్య, ఎంపీఓ ఉదయ్,గ్రామ సర్పంచ్ కంకిరెడ్డి,ఉప సర్పంచ్,పీఎస్సీఎస్ చైర్మన్,ఎస్సైలు రాజు ,బాలరాజు,వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఈసా నదిని ఆనుకుని ప్రభుత్వం చేయదలచుకున్న అభివృద్ధిని రైతులకు చెబితే రైతులే ఆ అభివృద్ధి పనులు చేపడతారు..







**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**రాజేంద్రనగర్,ఏప్రిల్ 13(సూర్యరేఖ)** హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఈసా నది పొడవునా ఉప్పర్పల్లి, హైదర గూడ బస్తీలకు చెందిన 64మంది పట్టాదారులకు చెందిన 32 ఏకరాలను గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం తీసుకుంటాననడం బాధాకరమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి అన్నారు.న్యాయం కోసం పోరాటం, గాంధీ పేరిట రైతులకు టోపి - ఇదెక్కడి న్యాయ 6. బడా బాబుల కోసం బక్క రైతుల బలి- ఇదేమి న్యాయం అంటు హైదర్ గూడ, ఉప్పర్పల్లి రైతులు వారి కుటుంబ సభ్యులు సోమవారం ఈసీ నది పరివాహక ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్రెడ్డి మాట్లాడుతూ...తాను ఇక్కడికి లీడర్గా,నాయకుని గా రాలేదని,మీరంతా నా ఓటర్లని, మీ బాధలు వినడానికి వచ్చానన్నారు.అందు కోసం నాకు జీతం వస్తుందన్నారు.రాజకీయాలు చేయడానికి రాలేదన్నారు.గతంలో రోడ్లు,కెనాల్స్, ట్రాన్స్ ఫార్మర్లు,టవర్లు పెట్టడానికి భూసేకరణ జరిపేవారని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రీయల్ పార్కుల కోసం బడా బాబులకు కేటాయించడానికి రైతుల భూములు లాక్కొంటుందన్నారు.నా పార్లమెంటు నియోజకవ ర్గంలోని నాలుగు మండలాలలో భూములను రైతులనుంచి లాక్కొని ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటు కోసం బడా బాబులకు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉందని అందుకే రైతుల భూములు లాక్కొంటుందన్నారు.నా పార్లమెంటు నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో భూములను రైతులనుంచి లాక్కొని ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటు కోసం బడా బాబులకు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉందని ఇది మంచి విధానం కాదన్నారు.గత పాలకులు రాష్ట్రంలో ఈ విధానాన్ని కొనసాగించారని,ఇప్పటి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నిజాం ప్రభువులు ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తే ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ లో ఉన్న ప్రభుత్వ భూమిలో అప్పట్లో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.ఉప్పర్ పల్లి,హైదర్ గూడ రైతుల పోరాటం న్యాయమైనదని బావిస్తున్నానన్నారు. మూసీ పక్కనుంచి రోడ్డు వేసుకోవడానికి మీరు స్థలం ఇస్తామంటున్నారని మీ పెద్ద మనస్సును మెచ్చుకుంటున్నానన్నారు. మూసీ పక్కన ఉన్న రైతుల భూములుతీసుకుంటామంటున్న ప్రభుత్వం ఆ భూములు ఎందుకు తీసుకుంటున్నారో చెప్పాలన్నారు.దేనికి ఉప యోగిస్తున్నారో చెప్పి తీసుకోవాలన్నారు.ప్రభుత్వం ఈసా నది పరివాహక ప్రాంతంలో ఎం పెట్టాలనుకుంటు న్నారో.. రైతులకు చెప్పాలని, వారే ఆహోటళు ,,మాల్ లు నిర్మించుకుంటారని గుర్తు చేశారు.అలా కాకుండ ప్రభుత్వం రైతులనుంచి భూములను లాక్కొని ఇతర కంపెనీలకు కేటాయించి రైతులకు నష్టపరిహారం ఇస్తామనడం భావ్యం కాదని,అది బ్రోకర్లు చేసే పని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయమన్న హోటల్, మాల్ లు ఏర్పాటు చేయడం సాధ్యం కానప్పుడు వారు అమ్ముతారని,ఇదే విషయాన్ని రైతులు ప్రభుత్వానికి తెలియజేయా లన్నారు. టిప్పుకాన్ బ్రిడ్జి వద్ద ఉన్న మధురిడ్జ్ పార్కు భవనానికి అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కూల్చివేస్తామంటున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని అది కూడా మంచి పద్దతి కాదన్నారు. ఈసా పరివాహక ప్రాంతంలో ఎకరం ధర రూ. 50 కోట్లు ఉందని,దానికి రెండింతలు ఎక్కువ అంటే రూ.150కోట్లు ఎకరాకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారని,దానిలో నిజముందన్నారు .అలా కాకుండ రూ.50 కోట్లు పలికే ఎకర స్థలానికి రూ. 2 కోట్లు నష్టపరిహారం ఇస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. మొన్నటి వరకు గతంలో ప్రభుత్వం లో ఉన్న వారు రైతుల భూములు లాక్కొన్నారని వాపోయారు. ఫార్మ సిటీ పేరుతో నాలుగు వేల ఎకరాలు, చందన్వెల్లిలో 1100ఎకరాలు, సీతారాంపూర్ లో 1100 ఎకరాలు,మల్లన్న సాగర్ ఊర్లన్ని ముంచేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మీ దగ్గరకు వారే వచ్చి రాజకీయాలు చేయాలనుకుంటారని,వారి మాటలు నృవద్దన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించాలని, సోషల్ మీడియా లో మీకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచానికి తెలియజేయాలని రైతులకు సూచించారు. రేవంత్ రెడ్డి డిస్కో డాన్స్ చేసినా మూసీ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతాం.. నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి శివతాండవం చేసినా డిస్కో డాన్స్ చేసినా మూసీ ప్రాజెక్టును అడ్డుకుని తీరుతాం అని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూసీ నది బఫర్ జోన్ 50మీటర్లు అన్నప్పుడు,500 మీటర్ల దూరం ఉన్న వాళ్లకి నోటీసులు ఎందుకు ఇచ్చారు.?అని ప్రశ్నించారు. ఇది రియల్ ఎస్టేట్ దందా కాదా? అని నిలదీశారు. నిలువనీడ లేకుండా పేదల ఇండ్లు కూల్చేసి ఇష్టారాజ్యంగా కట్టడాలు చేపడుతామంటే కుదరన్నారు.ప్రజల తరపున బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.ఈసా నది పరివాహక ప్రాంతంలో రైతులు భూములు తీసుకుని ఎం చేస్తారో చెప్పని ప్రభుత్వం ఎలా రైతులనుంచి భూములు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, అలాంటప్పుడు ఈ ప్రాజెక్టులన్ని ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.హైదర్ గూడ, ఉప్పరపల్లి రైతులకు అండగా ఉంటానని, ఒక్క ఎకరం కూడా పోనివ్వకుండ చూస్తానని,గట్టిగా పోరాడుదాం అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు టి.అంజన్ కుమార్,తోకల శ్రీనివాస్ డ్డి, ఈసా నది పరివాహక ప్రాంతంలో ఉన్న రైతులు రాజమల్లయ్య,కొలన్ సుబాష్ రెడ్డి,మోండ్ర నర్సింహ్మ, ఎం.కొమురయ్య,పెంటారెడ్డి,విజయ్ కుమార్,వెంకటేష్,లతో పాటు పెద్ద ఎత్తున రైతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గోదాం స్థల యజమాని జీవన్ దాస్ కు నష్టపరిహారం చెల్లించాలి..



**రాజేంద్రనగర్,ఏప్రిల్13(సూర్యరేఖ)** శివరాంపల్లిలో ఆదివారం జరిగిన గోదాం అగ్ని ప్రమాదంలో పక్కనే ఉన్న రిటైర్డ్ ఉద్యోగి జీవన్ దాస్ ఇంటిపై ఫ్లోర్ పూర్తిగా దగ్ధమైంది.ఎలాంటి అనుమతులు లేకుండా దాదాపు 1000గజాల్లో అక్రమంగా నిర్మించిన గోదాంలో ఆదివారం మంటలు చెలరేగడంతో గోదాం పక్కనే ఉన్న జీవన్ దాస్ ఇంటికి నిప్పు అంటుకుంది.దీంతో జీవన్ దాస్ ఇంటి పై ఫ్లోర్ పూర్తిగా దగ్ధమైంది.ఇంటికి నిప్పు అంటుకోవడంతో జీవన్ దాస్ కు భారీ అస్తి నష్టం జరిగింది.కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వీలు లేకుండా పోయింది.ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజలు నివసించే స్థలాల్లో గోదాంకు అద్దెకు ఇచ్చిన స్థలం యాజమని కొత్త మహేష్ రెడ్డి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ లో అతనిపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## మహిళా బిల్లు చట్టసవరణ ముసాయిదాకు కేంద్ర ఆమోదం చారిత్రాత్మకం

**మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను సాధించిన ఘనత బీజేపీదే**

**రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మేకల వనిత రెడ్డి**



**రాజేంద్రనగర్,ఏప్రిల్13 (సూర్యరేఖ):**ద మహిళ బిల్లు చట్టసవరణతో లోక్ సభలో ప్రస్థుతం ఉన్న 543 స్థానాలను 816కు పెంచే ముసాయిదా బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపడం చారిత్రాత్మకమని,ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని బీజేపీ ప్రభుత్వం తీసుకొని మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవడం జరిగిందని రంగారెడ్డి జిల్లా బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మేకల వనిత రెడ్డి అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పనలో భాగంగా పార్ల మెంట్ లో 273 స్థానాలు మహిళలకు దక్కుతుండడం శు భపరిణామం అని ఆమె వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఆమె మాట్లాడుతూ..ఆదివారం సంయుక్తంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో నారీ శక్తివందన్ అదినియమ్ చట్టాన్ని లోక్ సభలో కన్నా 2029లోపు శాసనసభ ఎన్నికలు జరుగనున్న అన్ని రాష్ట్రాల్లో అమలులోకి తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు.పార్లమెంట్లో ఈ నెల 16,17,18వ తేదీల్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరం అని అన్నారు.మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందని,దేశంలోని జనాభాలో సగభాగం ఉన్న మహిళలు శాస్త్ర,సాంకే తిక,పారిశ్రామిక,క్రీడలు, రక్షణ,సంగీత,లలిత కళల రంగాల్లో సాధిస్తున్న విజయాలకు దేశ గర్విస్తుండడంతో కోట్లాది మంది మహిళల ఆకాంక్షకు నరేంద్రమోడీ ప్రతిరూపంగా నిలిచాడని పేర్కొ న్నారు.బిజెపి ప్రభుత్వ హయాంలోని గత 2023లో నారీ శక్తివందన్ అదినయమ్ చట్టం పార్లమెంట్లో ఆమోదం పొందడం జరిగిందని,ఈ చారిత్రాత్మక సమావేశంలో మహిళమణుల కోసం నరేంద్రమోడీ చేపడుతున్న బృహత్కార్యానికి జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించే విధంగా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని అన్నారు.మహిళల ప్రాతినిథ్యంపై దశాబ్దాలుగా అసెంబ్లీల నుండి పార్లమెంట్ వరకు ఉన్న నిరీక్షణకు ఈ చట్టం తెరదించుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య నిర్మాణాలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని,దశాబ్దాలుగా చాలామంది ఇదే అభిప్రాయాన్ని తెలియజేస్తోన్నారని గుర్తు చేశారు.ఈ విషయం దాదాపు నాలుగు దశాబ్దాలుగా చర్చలో ఉందని,అన్ని రాజకీయ పార్టీల కృషి ఇందులో ఉందని వివరించారు.ప్రతి పార్టీ తమదైన పద్ధతిలో ఈ ఆలోచనను ముందుకు తీసుకెళ్ళిందని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత చట్టాన్ని 2029 నాటికి అమలు చేయాలని ప్రజాప్రతినిధుల నుండి ఏకగ్రీవ డిమాండ్ వచ్చిందని గుర్తు చేశారు.ఈ అంశంపై ఏప్రిల్ 16 నుండి పార్లమెంటులో సమగ్ర చర్చ జరుగుతుందని పేర్కొన్నారు .మహిళల సాధికారత ప్రయోజనం కోసం అన్ని పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగుతాయనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.పరస్పర సహకారం,భాగస్వామ్యం తో ముందుకు సాగాలనేదే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నమని,అందరి ఆకాంక్ష అదే అవుతుందని అంచనా వేశారు.

## మలుపులు తిరుగుతున్న మంగ్లీ కేసు

**హైదరాబాద్ :** సింగర్ మంగ్లీపై ఫిర్యాదు చేసేందుకు లాయర్ సుబ్బారావు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా హైడ్రామా చోటుచేసుకుంది. ఆల్కహాల్ తాగి వచ్చాడని అనుమానంతో సుబ్బారావుకు పంజాగుట్ట సీఐ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించారు. రీడింగ్ 27 పాయింట్లు రాగా, మోతాదులోపు ఆల్కహాల్ తీసుకున్నట్టు నిర్ధారణ అయింది. అయితే తాను రాత్రి మద్యం సేవిస్తే ఉదయం పీఎస్‌కు వచ్చిన తనకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయడం ఏంటని లాయర్ సుబ్బారావు పోలీసులను ప్రశ్నించారు. తనను అవమానించి, కేసు తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ఇలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తానేమైనా డ్రంక్ చేసి వాహనం నడిపానా ఏంటి.. కేవలం ఫిర్యాదు చేయడానికి కామన్ మ్యాన్‌లా పీఎస్‌కు వచ్చిన తనతో పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదన్నారు. తనపై మంగ్లీ చేసిన ఆరోపణలకు ఆధారం చూపించాలని డిమాండ్ చేశారు. తనపై నిరాధార ఆరోపణలను చేయడంతో ఎంతో మందిని మోసం చేసిన సింగర్ మంగ్లీపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పంజాగుట్ట పోలీసులను కోరారు. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తారు, వారి గురించి మీరు హడావుడి చేయవద్దు అని సుబ్బారావుకు పంజాగుట్ట పోలీసులు సూచించారు. అయితే బాధితుల తరఫున తాను లీడ్ చేస్తున్నానని, లాయర్ గా వారికి అన్ని రకాలుగా చట్ట ప్రకారం సహాయం చేస్తానన్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్ట ప్రకారం శిక్ష తప్పదని, బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

# బిజినెస్

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు. 2025-26లో 12,000 మంది ఉద్యోగులను టీసీఎస్ తొలగించింది. కంపెనీలో మెరుగైన పని తీరు కనబరిచినంత వరకు కెరీర్‌కు ఇబ్బంది ఉండదని కృతివాసన్ భరోసా ఇచ్చారు. గత ఏడాది కోతలకు, కృత్రిమ మేధ (ఏఐ) కారణమన్న వాదనలను తోసిపుచ్చారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది సీనియర్ లెవల్‌కు చెందిన వారని తెలిపారు.

## 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు




పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన అంతరాయాల మధ్య ఇంధన లభ్యతను నిర్వహించే క్రమంలో మన దేశంలో 5 కిలోల చిన్న ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాను పెంచారు. అలాగే పైప్డ్ సహజ వాయువు (పీఎన్‌జీ) కనెక్షన్లను కూడా పెంచారు. మార్చి 23 నుంచి 13 లక్షలకు పైగా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లను విక్రయించారు. ప్రస్తుతం రోజువారీ విక్రయాలు లక్ష యూనిట్లను అధిగమించాయి. వలస కార్మికులు, తక్కువ ఆదాయ వినియోగదార్లు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మార్చి నుంచి 4,24,000 కొత్త పీఎన్‌జీ కనెక్షన్లను యాక్టివేట్ చేశారు. పరివర్తనలో భాగంగా 30,000 మందికి పైగా వినియోగదార్లు ఎల్‌పీజీ కనెక్షన్లను సరెండర్ చేశారు. ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం: పశ్చిమాసియాలో యుద్ధం మొదలై ఆరు వారాలు కావడంతో అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు నెలకొన్నాయి. మన దేశం సగానికి పైగా ముడి చమురును, 40 శాతం గ్యాస్‌ను, 85-90 శాతం ఎల్‌పీజీని ఈ ప్రాంతం నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలతో దిగుమతులపై ప్రభావం పడింది. దీంతో దేశ అవసరాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నా, ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ప్రభావం ఉంది. దీంతో ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాణిజ్య వినియోగదార్లకు సరఫరాలో కోతలు విధిస్తూ, గృహ వినియోగదార్లకు ఎల్‌పీజీ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చింది. వంట గ్యాస్ ఎల్‌పీజీ కనెక్షన్లు లేని వారి కొరతను భర్తీ చేయడానికి మార్కెట్ ధరకు లభించే 5 కిలోల సిలిండర్ల సరఫరాను పెంచింది. సంక్షోభానికి ముందు ఫిబ్రవరిలో సుమారు 77,000 అయిదు కిలోల సిలిండర్ల అమ్మకాలు జరగ్గా, గత 2-3 వారాలుగా రోజువారీ అమ్మకాలు లక్ష దాటాయి. గృహ ఎల్‌పీజీ సరఫరాలు మొత్తంగా స్థిరంగా ఉన్నాయని, ఏప్రిల్ 11న 52 లక్షలకు పైగా సిలిండర్లను సరఫరా చేసినట్లు తెలుస్తోంది.

# చైనాపై 50% అదనపు సుంకాలు విధిస్తాం



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చైనాపై బెదిరింపులకు దిగారు. ఇరాన్ నుంచి చమురు కొనుగోలు కొనసాగిస్తే చైనాపై 50% వరకు అదనపు సుంకాలు విధిస్తామని ఆయన ప్రకటించారు. ఈ చర్య ద్వారా ఇరాన్ ఆర్థిక వనరులను అడ్డుకోవడం, చైనా వాణిజ్య ఆధిపత్యాన్ని నిరోధించడం అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ చైనా ఇరాన్ నుంచి చమురును ప్రధానంగా కొనుగోలు చేస్తోంది. ఇది ఇరాన్ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటానికి సహాయపడుతున్నందున ఈ హెచ్చరిక జారీ చేయబడింది. చైనా నుంచి వచ్చే ఉత్పత్తులపై అదనపు పన్నులు విధిస్తానని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగితే, ఈ చర్యలను మరింత కఠినతరం చేస్తామని, 50% పన్ను విధిస్తామని ట్రంప్ అన్నారు. ఇరాన్‌తో చైనా చమురు వాణిజ్యాన్ని నిలిపివేసి, దానికి బదులుగా వెనిజులా నుంచి తక్కువ ధరకు ఇంధనాన్ని అందిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణను దుర్వినియోగం చేసి ఇరాన్ ఆయుధాలను నిల్వ చేసుకుంటోందని ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని చైనా రాయబార కార్యాలయం ఒక అధికారిక ప్రకటనలో స్పందించింది. తాము యుద్ధంలో ఏ పక్షానికీ ఆయుధాలు అందించడం లేదని కూడా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక శక్తుల మధ్య జరుగుతున్న ఈ పోరాటం ప్రపంచ మార్కెట్‌పై తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. సరఫరా గొలుసును ప్రభావితం చేయడంతో పాటు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుల ధరల పెరుగుదలకు కూడా దారితీయవచ్చు. ఇరాన్‌ను ఆర్థికంగా ఏకాకిని చేయాలన్న అమెరికా ప్రయత్నాలకు చైనా సహకారం ఒక అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితుల్లో, వాణిజ్య సుంకాలను పెంచడం ద్వారా ట్రంప్ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రంప్ చర్యలు కొత్త వాణిజ్య యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# తులం బంగారం ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే




అంతర్జాతీయంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్నప్పుడు ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించడం వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం భయాలను పెంచాయి. దీని ప్రభావంతో స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతుండగా, బంగారం ధరలు మాత్రం రికార్డు స్థాయిలకు చేరుతున్నాయి. నేడు భారతీయ మార్కెట్లో 24 క్యారెట్ల (మేలిమి) బంగారం ధర పది గ్రాములకు రూ.1,52,830 వద్ద పలుకుతోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో బంగారం ధరలు ఒకే రకంగా ఉన్నాయి. ఇక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,830 కాగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,090 కు చేరింది. అంటే దాదాపు లక్షన్నర రూపాయలకు దగ్గరగా పసిడి రేటు ఉండటంతో పెళ్లిళ్ల సీజన్లో ఉన్న వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో మాత్రం ధరలు వీటికంటే కాస్త ఎక్కువగా (రూ.1,53,810) ఉన్నాయి. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగానే పెరుగుతోంది. దేశీయ మార్కెట్లో నేడు కిలో వెండి ధర రూ.2,64,900 వద్ద ఉంది. అంటే గ్రాము వెండి ధర సుమారు రూ.264.90 పలుకుతోంది. పారిశ్రామికంగా వెండికి డిమాండ్ పెరగడం, ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో వెండి ధరలు కూడా వచ్చే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పటికీ, యుద్ధ మేఘాలు తొలగిపోకపోతే ఇవి ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ధర తగ్గినప్పుడల్లా కొంచెం కొంచెం కొనుగోలు చేసే బై ఆన్ డిప్స్ పద్ధతిని పాటించాలని సూచిస్తున్నారు. అయితే స్థానిక డిమాండ్, రాష్ట్ర పన్నులు, మేకింగ్ ఛార్జీల బట్టి మీరు కొనే జువెలరీ షాపులో ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు.

# ఈ లెక్కన ఎస్ఆర్‌హెచ్‌కు మూడినట్లే!




ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. బరిలోకి దిగిందే మొదలు బాదుడే లక్ష్యంగా పెట్టుకున్న ఈ బుల్లోడు 266.66 స్ట్రైక్‌రేట్‌తో 200 పరుగులకు పైగా సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. తాను క్రీజులో ఉంటే బౌలర్ ఎవరైతే నాకేంటి.. బంతిపైనే తన దృష్టి ఉంటుందని ఇటీవలే ఆర్సీబీతో మ్యాచ్ అనంతరం డైరెక్ట్ స్టేట్‌మెంట్ విడుదల చేయడం గమనార్హం. ఇప్పటివరకు రాజస్తాన్ ఆడిన ప్రతీ జట్టులో ఒక ప్రధాన బౌలర్‌ను వైభవ్ ఒక ఆట ఆడుకున్నాడు. చెన్నైతో మ్యాచ్‌లో మాట్ హెన్రీని, గుజరాత్‌తో మ్యాచ్‌లో రబాడను, ముంబైతో మ్యాచ్‌లో బుమ్రాను, ఆర్సీబీతో మ్యాచ్‌లో హాజిల్‌వుడ్‌ను లక్ష్యంగా చేసుకొని ఫోర్లు, సిక్సర్లు బాదాడు. ఇక ఇవాళ వైభవ్ సూర్యవంశీ ఎస్ఆర్‌హెచ్‌ను వారి సొంతగడ్డపైనే ఎదుర్కోనున్నాడు. బుమ్రా, హాజిల్‌వుడ్, రబాడ వంటి టాప్ బౌలర్లను ఉతికారేసిన వైభవ్ ముందు ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ చిన్నబోతోంది. కమిన్స్ లేకపోవడంతో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనంగా తయారయ్యింది. ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ బౌలర్ లేకపోవడం మైనస్‌గా మారింది. ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఎస్ఆర్‌హెచ్ బౌలర్లు దారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. యావరేజ్‌గా చూసుకుంటే ప్రతీ ఓవర్‌కు 10.42 పరుగులివ్వడం గమనార్హం. ఐపీఎల్ 2026 సీజన్‌లో బౌలింగ్ పరంగా అత్యంత చెత్త ప్రదర్శన ఎస్ఆర్‌హెచ్‌దే. ఇక పేసర్ల పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది. హర్షల్ పటేల్, ఉనాద్కట్, ఇషాన్ మలింగలతో కూడిన పేస్ త్రయం ప్రతీ ఓవర్‌కు సగటున 11.47 పరుగులు సమర్పించుకున్నారు. ఈ లెక్కన ఇవాళ్టి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ మరోమారు చెలరేగితే మాత్రం ఎస్ఆర్‌హెచ్ బౌలర్లకు మూడినట్లేనని క్రికెట్ అభిమానులు భావిస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే రాజస్తాన్ రాయల్స్‌తో మ్యాచ్ అంటేనే ప్రత్యర్థి జట్ల బౌలర్లు హడలెత్తిపోయేలా చేస్తున్నాడు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఇక ఐపీఎల్‌లో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్‌దే పైచేయిగా ఉంది. ఇప్పటివరకు ఇరుజట్లు 21 సార్లు తలపడితే ఎస్ఆర్‌హెచ్ 12 సార్లు, రాజస్తాన్ 9 సార్లు విజయాలు అందుకున్నాయి. సీజన్‌లో ఇప్పటికే వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్న రాజస్తాన్ ఐదో విజయంపై కన్నేసింది. మరోవైపు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించిన ఎస్ఆర్‌హెచ్ సొంతగడ్డపై రెండో విజయాన్ని అందుకోవాలని చూస్తోంది.

# మహిళల టీ20 వరల్డ్‌కప్.. 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసీసీ




దుబాయ్: ఈ ఏడాది జూన్‌లో మహిళల టీ20 వరల్డ్‌కప్ జరగనున్నది. దీని కోసం ఇవాళ ఐసీసీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో విజేతలకు అందజేసే ప్రైజ్‌మనీని రికార్డు స్థాయిలో పెంచేసింది. రెండు నెలల పాటు ఇంగ్లండ్, వేల్స్‌లో జరిగే వరల్డ్‌కప్ కోసం సుమారు 82 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది ఐసీసీ. గత ఎడిషన్‌తో పోలిస్తే సుమారు 10 శాతం ప్రైజ్‌మనీ పెంచారు. ఈసారి ఈ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొననున్నాయి. 2024లో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. జూన్ 12 నుంచి జూలై 5వ తేదీ వరకు ఏడు వేదికల్లో టోర్నీ జరగనున్నది. లార్డ్స్ మైదానంలో ఫైనల్ మ్యాచ్ ఆడుతారు. గత వరల్డ్‌కప్‌లో ప్రైజ్‌మనీ 74 కోట్లు కాగా, ఈసారి 82 కోట్లు ఇవ్వనున్నారు. వరల్డ్‌కప్ విజేతలు ఈసారి 21.8 కోట్ల ప్రైజ్‌మనీ గెలుచుకుంటారు. ఇక రన్నరప్‌కు 10 కోట్లు ఇవ్వనున్నారు. సెమీఫైనల్లోకి ఎంటరైన జట్లకు 6.29 కోట్లు ఇవ్వనున్నారు. ఇక గ్రూపు మ్యాచ్ ఆడిన ప్రతి జట్టుకు 29 లక్షలు ఇవ్వనున్నారు. ప్రతి జట్టుకు కనీసం రెండు కోట్లు దక్కే అవకాశాలు ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది. జూన్ 12వ తేదీన బర్మింగ్ హామ్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఫస్ట్ మ్యాచ్ జరుగుతుంది. ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్ , స్కాట్‌ల్యాండ్, దక్షిణాఫ్రికా, వెస్ట్ ఇండీస్ కూడా టోర్నీలో ఉన్నాయి. 24 రోజుల్లో మొత్తం 33 మ్యాచ్‌లు ఆడనున్నారు.

# స్పోర్ట్స్

## డగౌట్‌లో సెల్‌ఫోన్.. రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్‌కు బీసీసీఐ నోటీసులు




**గౌహతి:** రాజస్థాన్ రాయల్స్ టీమ్ మేనేజర్ రోమి బిందర్ చిక్కుల్లో పడ్డారు. గత శుక్రవారం ఆర్సీబీతో మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఆయన డగౌట్‌లో సెల్‌ఫోన్‌తో కనిపించారు. ఈ ఘటన పట్ల బీసీసీఐ సీరియస్‌గా ఉంది. రోమి బిందర్‌కు ఇవాళ బీసీసీఐ నోటీసులు జారీ చేసింది. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడినట్లు బిందర్‌పై ఆరోపణలు వస్తున్నాయి. టీమ్ డగౌట్‌లో ప్లేయర్లు ఉండే ప్రదేశంలో మేనేజర్ రోమి బిందర్ సెల్‌ఫోన్ చూస్తున్నట్లు దృశ్యాలు రిలీజ్ అయ్యాయి. పక్కనే కూర్చున్న వైభవ్ సూర్యవంశీ .. అతని ఫోన్‌ను తీక్షణంగా చూస్తున్నట్లు ఆ వీడియోలో ఉన్నది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ కావడంతో వివాదం ముదిరింది. దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఐపీఎల్ చైర్మెన్ లలిత్ మోదీ కూడా డిమాండ్ చేశారు. బీసీసీఐకి చెందిన యాంటీ కరప్షన్ అండ్ సెక్యూర్టీ యూనిట్(ఏసీఎస్‌యూ) రోమి బిందర్‌కు నోటీసులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఈ చర్యకు పాల్పడింది. అయితే 48 గంటల్లో ఆయన తన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దేని కోసం రోమి బిందర్ డగౌట్ ఏరియాలో ఫోన్ పట్టుకున్నారో తన వివరణలో చెప్పాల్సి ఉంటుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాలని ఏసీఎస్‌యూ విభాగాన్ని ఆదేశించామని, దీనిపై నివేదికను ఇవ్వాలని కోరినట్లు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మెన్ అరుణ్ ధుమాల్ ఓ మీడియాతో తెలిపారు. అయితే ఆరోగ్య కారణాల కోసం బిందర్ ఫోన్ వాడి ఉంటారని భావిసత్ఉన్నారు. గతంలో ఆర్ఆర్ టీమ్ మేనేజర్‌కు ఆరోగ్య సమస్యలు ఎదరయ్యాయి. నాగపూర్‌లో ఓసారి ఆయన్ను ఆస్పత్రిలో చేర్పించారు. మెడికల్ కారణాల చేత ఆయన తన ఫోన్‌కు డగౌట్‌కు తీసుకెళ్లే వీలు ఉంది, కానీ అక్కడ కూర్చుని ఫోన్‌ను వాడరాదు అని నియమావళి ఉన్నట్లు తెలుస్తోంది. రోమి ఇటీవల 10 కిలోల బరువు తగ్గినట్లు కొన్ని రిపోర్టుల ద్వారా తెలిసింది. అయితే రోమి మెడికల్ కండీషన్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ అధికారులు చర్యలు తీసుకుంటారని చెబుతున్నారు.



## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ 'డ్రాగన్'పై పెరుగుతున్న హైప్


పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న డ్రాగన్ సినిమా రోజురోజుకు వార్తల్లో నిలుస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ క్రేజ్‌ను సంపాదించింది. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం, 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించడం ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్, నటీనటుల ఎంపికపై సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోతో సమానంగా పవర్‌ఫుల్ విలన్ పాత్ర ఉంటుందని ఇప్పటికే టాక్. తొలుత మలయాళ స్టార్ టోవినో థామస్ ను నెగటివ్ రోల్ కోసం సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పుడు ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఎన్టీఆర్‌కు ధీటుగా నిలిచే విలన్‌గా ఆయనను ఎంపిక చేయాలని మేకర్స్ భావిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే చర్చలు జరిగాయని, త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని టాక్ నడుస్తోంది. ఇక షూటింగ్ ఆగిపోయిందంటూ వచ్చిన వార్తలను చిత్ర బృందం ఖండించింది. ఎన్టీఆర్ లుక్ విషయంలో డైరెక్టర్‌తో విభేదాలు వచ్చాయని ప్రచారం జరిగినా, అందులో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ప్రశాంత్ నీల్ తన సినిమాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రతి షెడ్యూల్ మధ్య గ్యాప్ తీసుకోవడం సాధారణమేనని, ప్రస్తుతం షూటింగ్ ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగుతోందని తెలిపింది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ఇప్పటివరకు చూడని రగ్గడ్, ఊర మాస్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే లీక్ అయిన కొన్ని ఫొటోలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ లేదా టైటిల్ టీజర్ విడుదల చేసే అవకాశముందని తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. ఈ సినిమా 2026 చివరిలో లేదా 2027 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశం ఉంది.

## కాశీ అనుభవాలపై నటుడు ఆర్య సంచలన వ్యాఖ్యలు

### సాధువుల వేషంలో క్రిమినల్స్ ఉన్నారంటూ కామెంట్



తమిళ్‌తో పాటు తెలుగులోనూ హీరోగా, విలన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు ఆర్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. త్వరలో విడుదల కానున్న తన కొత్త చిత్రం 'మిస్టర్ ఎక్స్' ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా ప్రారంభమయ్యాయి. తన కెరీర్ ప్రారంభంలో చేసిన నేనే దేవుడ్ని సినిమా షూటింగ్ సందర్భంగా ఎదురైన అనుభవాలను ఆర్య గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా కోసం వారణాసి (కాశీ)లో కొంతకాలం షూటింగ్ జరిపామని, అక్కడ నిజమైన సాధువులతో పాటు నకిలీ వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఆర్య మాట్లాడుతూ.. కాశీలో ఉన్న సాధువుల్లో చాలా మంది నిజాయితీ గలవాళ్లే. కానీ కొంతమంది మాత్రం సాధువుల వేషంలో క్రిమినల్స్‌గా ఉంటారు. వాళ్లకు ఎలాంటి గుర్తింపు పత్రాలు ఉండవు. పేరు అడిగినా 'స్వామి' అని మాత్రమే చెబుతారు. కొంతకాలం అక్కడ దాక్కొని తర్వాత వెళ్లిపోతారు" అని చెప్పారు అంతేకాకుండా కుంభమేళా సందర్భంగా కూడా ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశముందని ఆర్య వెల్లడించారు. "మేము కుంభమేళా షూటింగ్‌కు వెళ్లినప్పుడు పోలీసులు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది సాధువుల వేషంలో ఆయుధాలు కూడా కలిగి ఉంటారని చెప్పారు అని ఆయన పేర్కొన్నారు. ఆర్య చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొంతమంది ఆయన మాటలకు మద్దతు తెలుపుతూ, వాస్తవ పరిస్థితులను వెల్లడించారని అంటుండగా... మరికొందరు మాత్రం ఇలాంటి వ్యాఖ్యలు మతపరమైన భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శిస్తున్నారు.ఏదేమైనా, ఒక ప్రముఖ నటుడు ఇలాంటి విషయాలపై బహిరంగంగా మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. ఇది నిజంగా పరిస్థితులని ఉద్దేశించి చెప్పడమా ? లేక అతిశయోక్తి వ్యాఖ్యలా? అనే దానిపై ప్రస్తుతం నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ కొనసాగుతోంది.



## ఎస్క్వైర్ ఇండియా కవర్ పేజ్‌పై రామ్ చరణ్ మెరుపులు.. గ్లోబల్ స్థాయిలో అరుదైన గుర్తింపు!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ మరోసారి అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేసుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఎస్క్వైర్ ఇండియా ఏప్రిల్ ఎడిషన్ కవర్ పేజీపై ఆయన దర్శనమిచ్చారు. దుబాయ్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ ఫోటోషూట్‌లో రామ్ చరణ్ స్టైలిష్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న చరణ్... ఈ కవర్ ఫీచర్‌తో మరో మైలురాయిని అందుకున్నారు. గతంలో జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇదే మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ఆ ఘనత సాధించిన రెండో తెలుగు హీరోగా రామ్ చరణ్ నిలిచారు. దీంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫోటోషూట్‌లో చరణ్ స్టైలింగ్, ప్రెజెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటంతో, ఆయన గ్లోబల్ అప్పీల్ మరింత బలపడిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభిమానులు ఆయన పూర్తి ఇంటర్వ్యూకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. ఒక పాట మినహా మిగిలిన భాగాలన్నీ కంప్లీట్ కాగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు యూట్యూబ్‌లో భారీ వ్యూస్ సాధించి మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. బుచ్చిబాబు స్టైల్ ఎమోషన్స్, చరణ్ మేకోవర్ కలిసి ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఒకవైపు అంతర్జాతీయ మ్యాగజైన్ కవర్‌పై మెరుస్తూ, మరోవైపు క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న రామ్ చరణ్... ఈ ఏప్రిల్‌లో అభిమానులకు డబుల్ ట్రీట్ అందిస్తున్నాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

## గోపీచంద్ 'భరతవర్ష' గ్లింప్స్ విడుదల..

### యోధుడిగా అదిరిపోయే లుక్, దేశభక్తి కథపై అంచనాలు పీక్స్!



యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## ఎన్నాళ్లీ సింగిల్ బతుకు? క్లారిటీ ఇచ్చిన రామ్

తెలుగు హీరోల్లో బ్యాచిలర్స్ అనుకున్న వాళ్లకు కూడా ఒక్కొక్కళ్లకు పెళ్లిళ్లు అయిపోతున్నాయి. ప్రస్తుతం చూసుకుంటే ప్రభాస్, రామ్, సాయిధరమ్ తేజ్ లాంటి కొందరు మాత్రమే ఇంకా సింగిల్‌గా ఉన్నారు. వీళ్లలో ప్రభాస్ చేసుకుంటాడా అంటే సందేహమే. సాయిధరమ్ తేజ్ మాత్రం ఈ ఏడాదో వచ్చే ఏడాదో శుభవార్త చెప్పేలా ఉన్నాడు. రామ్ మాత్రం ఇప్పుడు తన సింగిల్ స్టేటస్, పెళ్లి వాటిపై పరోక్షంగా క్లారిటీ ఇచ్చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయమై స్పందించాడు. 'చిన్నప్పటి నుంచి నేను ఒంటరిగా ఉండటం అలవాటుపడ్డా. ఖాళీ టైంని ఒక్కడినే ఆస్వాదిస్తుంటా. స్నేహితులు, మిగతా వాళ్లతో గడపటం ఇష్టమే ?కానీ నాకోసం నేను టైమ్ కేటాయించుకోవడంలో ఆనందముంది. ఆ ఏకాంతం నాకు ఎంతో రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఎవరైనా నా జీవితంలోకి వస్తే వాళ్లతో సమయం గడిపేందుకు సిద్ధమే. రాకపోయినా ఒంటరిగా సంతోషంగా ఉంటాను. ఇదేదో కావాలని తీసుకున్న నిర్ణయమైతే కాదు' అని రామ్ చెప్పుకొచ్చాడు. రామ్ మాటల బట్టి చూస్తుంటే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతాడేమో అనిపిస్తుంది. ఇతడి గత సినిమా 'ఆంధ్ర కింగ్ తాలుకా' టైంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో డేటింగ్ రూమర్స్ వచ్చాయి. ఇప్పుడు రామ్ మాటల బట్టి చూస్తుంటే అవన్నీ ప్రమోషన్స్ కోసం సృష్టించినట్లే అనిపిస్తున్నాయి. ఇకపోతే ఇండస్ట్రీలో వందలాది మందితో పనిచేయడం గురించి మాట్లాడుతూ.. అది తప్పదని చెబుతూనే, అందరి మధ్య కూడా తనకంటూ ఓ ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకున్నానని చెప్పుకొచ్చాడు. లాక్‌డౌన్‌లో ఏడాదిన్నర పాటు ఒంటరిగానే బతికానని గుర్తుచేసుకున్నాడు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,